**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :146 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 13 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## ముగిసిన జంతర్ మంతర్ శకం

- చారిత్రక పోరాటాలకు సజీవ సాక్ష్యం
- 1993 జైల్ భరో కార్యక్రమం నుంచి 2026 నీట్ పేపర్ లీకేజీ వివాదాల వరకు ఎన్నో కీలక ప్రజా ఉద్యమాలకు జంతర్ మంతర్ వేదికైంది
- ఇప్పుడు కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ప్రస్థానం ముగిసిపోయింది.

## మారనున్న తిరుపతి స్వరూపం

- వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన
- తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం



**అమరావతి**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు. తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

వివరాలు 2లో..



## ఆరు రాష్ట్రాలు.. కొత్త బాధ్యతలు

- కేంద్రం కీలక నిర్ణయం..
- ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు!
- కేరళ నుంచి తమిళనాడుకు అర్లేకర్ బదిలీ..
- కేరళ గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథూర్
- కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కింలకూ కొత్త నియామకాలు

**న్యూఢిల్లీ**

దేశంలోని ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సలహా మేరకు కేరళ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు సంబంధించి గవర్నర్ల నియామకాలు, బదిలీలపై రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పుల్లో భాగంగా ఇప్పటికే గవర్నర్లుగా పనిచేస్తున్న కొందరికి ఇతర రాష్ట్రాల బాధ్యతలు అప్పగించగా,

వివరాలు 2లో..




## బంగాళాఖాతంలో అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన
- దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
- రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం
- అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు
- రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు కురిసే సూచన
- ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు

## భారత్‌లోకి చొరబడేందుకు యత్నం

- మందుపాతర పేలి లష్కరే కీలక కమాండర్ సహా నలుగురు ఉగ్రవాదులు మృతి!
- కృష్ణ ఘాటిలో మందుపాతరల పేలుడులో నలుగురు ఉగ్రవాదులు మృతి
- మృతుల్లో లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ ఫైజాన్ ఉన్నట్లు సమాచారం
- పూంఛ్ జిల్లాలో ఎల్‌ఓసీ వెంబడి భద్రత కట్టుదిట్టం
- సత్వాల్-నాకి ప్రాంతంలోనూ పేలుడు కలకలం



## రాజ్యాంగ సంస్థలను దూషించడం దారుణం

- కాంగ్రెస్ ఓ దిశానిర్దేశం లేని పార్టీ
- సీఈసీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు నిరసన చేపట్టడంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందన
- రాజ్యాంగ సంస్థలను బహిరంగంగా దూషించడం సరికాదు
- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది



## విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఘోర ప్రమాదం



- నలుగురు సజీవ దహనం!
- ఈవీ కారులో మంటలు చెలరేగి నలుగురి దుర్మరణం..
- మరొకరి పరిస్థితి విషమం
- రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనా..
- ఘటనపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి

**విజయవాడ**

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎలక్ట్రిక్ వాహనం (ఈవీ)లో మంటలు చెలరేగడంతో నలుగురు సజీవ దహనమయ్యారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. నంబూరులో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు సమాచారం. ఒకే కుటుంబానికి చెందినవారు సహా నలుగురు ప్రాణాలు

వివరాలు 2లో..



## కోర్టు పరిశీలనలో ఉన్న అంశాలపై సమావేశం నిర్వహించడం న్యాయ నైతికతకు విరుద్ధం

- కాంగ్రెస్ సీనియర్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ లేఖ
- 'సుప్రీంకోర్టుకు ఆ విషయంలో ఎలాంటి అధికారాల్లేవ్'
- "న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి చర్చించడం అనుచితం
- అలాగే, ఆయా అంశాలపై కోర్టులో భౌతికంగా లేదా ఆన్‌లైన్ ద్వారా పిటిషన్ దాఖలు చేయాలి

## ఏపీలో స్థానిక సమరం

- మేయర్, మున్సిపల్ పీఠాల రిజర్వేషన్లు ఖరారు!
- 17 కార్పొరేషన్లు.. 106 మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ప్రకటించిన ప్రభుత్వం
- మేయర్ స్థానాల్లో బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీకి ఒకటి.. జనరల్ మహిళలకు 5
- మున్సిపల్ అధ్యక్ష పీఠాల్లో బీసీలకు 36, ఎస్సీలకు 14
- ఎన్నికల షెడ్యూల్‌పై ఉత్కంఠ




**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి రంగం సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మేయర్, చైర్‌పర్సన్ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ స్థానాలతో పాటు 106 మున్సిపాలిటీల అధ్యక్ష పీఠాలకు రిజర్వేషన్లు ప్రకటించింది. పురపోరుకు సంబంధించి షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఈ కేటాయింపులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. ఏ పట్టణంలో ఏ సామాజిక వర్గానికి అవకాశం దక్కిందనే అంశంపై ఆశావహులు, రాజకీయ పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. బీసీలకు ఐదు స్థానాలు కేటాయించగా, ఎస్సీలకు రెండు, ఎస్టీకి ఒక స్థానం దక్కింది. జనరల్ మహిళలకు ఐదు స్థానాలు

వివరాలు 2లో..

## ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్

- వైద్య సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం
- ఆసుపత్రుల్లో చికిత్స చార్జీలను స్పష్టంగా ప్రదర్శించాలని రాష్ట్రాలకు ఆదేశం
- రోగులు ముందే ఖర్చుపై అంచనా వేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదం
- క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నిబంధనలు అమలు చేయాలని సూచన
- విదేశీ రోగులకు అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రదర్శించాలని విజ్ఞప్తి



# బీసీల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం





**ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత**

**నియోజకవర్గంలో రూ.250 కోట్లతో 65 శాతానికి పైగా అభివృద్ధి పనులు- మంత్రి వాసంశెట్టి సుభాష్**

**కూటమి నిర్ణయాలకు కట్టుబడి.. ఐకమత్యంతో ముందుకు సాగాలని బీసీ నేతలకు పిలుపు**

బీసీల అభ్యున్నతి, రాజకీయ సాధికారత, సామాజిక అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముకగా నిలుస్తున్నారని, బీసీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.రామచంద్రపురం పట్టణంలోని లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వాసంశెట్టి సుభాష్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీసీ కులాల ఐక్యవేదిక నాయకుడు పెంద్ర రమేష్ తదితరులు హాజరయ్యారు. నియోజకవర్గంలోని వివిధ బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత ఎన్టీఆర్‌ది**

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అంటే బీసీలు.. బీసీలు అంటే తెలుగుదేశం పార్టీ అనే అనుబంధం దశాబ్దాలుగా కొనసాగుతోందన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన ఎన్టీఆర్ బీసీలకు రాజకీయంగా గుర్తింపు కల్పించేందుకు స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని మంత్రి విమర్శించారు. బీసీల హక్కుల గురించి మాట్లాడే ముందు గతంలో వారి రాజకీయ ప్రాతినిధ్యానికి జరిగిన నష్టంపై వైఎస్సార్‌సీపీ సమాధానం చెప్పాలని అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు ఎన్డీఏ కూటమి ప్రయత్నించగా, వైఎస్సార్‌సీపీ అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఎదురైన న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలోనూ, బీసీలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీపరంగా 34 నుంచి పైబడి ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం బీసీ కులాల పేరును ఉపయోగించుకుంటున్నారని మంత్రి సుభాష్ విమర్శించారు. అవినీతి ఆరోపణలు ఎదురైనప్పుడు లేదా చట్టపరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు మాత్రమే బీసీ కులాన్ని ప్రస్తావిస్తూ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. బీసీల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేయడమే నాయకుల బాధ్యత కావాలని పేర్కొన్నారు.

తనపై కొంతమంది రాజకీయంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, తాను లేదా తన కార్యక్రమాల్లో అవినీతి జరిగినట్లు ఎవరైనా నిరూపిస్తే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు.

**రూ.250 కోట్లతో రామచంద్రపురం అభివృద్ధి**

ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి, 65 శాతానికి పైగా అభివృద్ధి సాధించామని మంత్రి వివరించారు. రానున్న కాలంలో మరిన్ని నిధులు తీసుకొచ్చి రామచంద్రపురం నియోజకవర్గాన్ని సువర్ణ రామచంద్రపురంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇరిగేషన్, బ్రిడ్జిల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.3,000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. రానున్న సంవత్సర కాలంలో నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

మాజీ మంత్రి వేణు బీసీ కులాల ధ్రువీకరణ పత్రాల మంజూరు అంశంలో ప్రజలను తప్పుదోవ పట్టించారని మంత్రి విమర్శించారు. బీసీల సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన నాయకులు వాస్తవాలతో మాట్లాడాలని సూచించారు.

**పేదల సేవే నా జీవిత లక్ష్యం**

"మానవసేవే మాధవసేవ" అనే స్ఫూర్తితో తాను సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని మంత్రి సుభాష్ తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరి గుండె ఆగిపోకూడదనే సంకల్పంతో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు సహాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు.

ప్రభుత్వపరంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వ్యక్తిగతంగా, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా, సీఎస్‌ఆర్ నిధుల సహకారంతోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని వివరించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారానే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు.

**కూటమి నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలి**

ఎన్డీఏ కూటమి తీసుకునే నిర్ణయాలకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు కట్టుబడి ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున ఎవరికి అవకాశం కల్పించినా, వారిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ మేరకు నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ముందుకు సాగుతోందని, బీసీలంతా ఐకమత్యంతో ఉండి ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు.

**బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం - గుత్తుల సాయి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి మాట్లాడుతూ.. బీసీలకు పార్టీపరంగా 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు వ్యక్తిగతంగా, సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ప్రజలకు సహాయం అందించడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.

బీసీలంతా ఐకమత్యంగా ఉండాలి - కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం

సమ్మేళనానికి అధ్యక్షత వహించిన కూటమి పార్టీ సీనియర్ నాయకుడు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. బీసీలంతా ఐకమత్యంగా ఉండి ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి పనిచేస్తోందని తెలిపారు.

బీసీ సంఘాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారానికి నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**కూటమి ఐక్యతతో స్థానిక సంస్థల్లో ముందుకు సాగుదాం**

ఏఎంసీ చైర్మన్ అక్కల రేశ్వంత రాయ్ మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కూటమి అధిష్టానం నిర్ణయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కూటమి పార్టీల మధ్య ఐక్యతే ప్రజాసేవకు బలమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో కూటమి నిర్ణయాలకు కట్టుబడి, సమష్టి కృషితో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక నాయకుడు పెంద్ర రమేష్‌తో పాటు దంగేటి గౌరీశంకర్, మేడిశెట్టి సూర్యనారాయణ, సనపల ధనరాజు, వనుం వీరబ్రహ్మం,టేకుమూడి, సత్యనారాయణ, వెదుర్లయ్య, కుడుపూడి ఫణితేజ, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. బీసీల ఐక్యత, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## ఆరు రాష్ట్రాలు.. కొత్త బాధ్యతలు

-మొదటిపేజీ తరువాయి

మరికొందరికి తొలిసారిగా గవర్నర్ పదవులు కేటాయించారు. తాజా నిర్ణయం ప్రకారం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథూర్‌ను కేరళ గవర్నర్‌గా నియమించారు. కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు తమిళనాడు బాధ్యతలు అప్పగించారు. ఝార్ఖండ్‌కు చెందిన సీనియర్ నాయకుడు బ్రజ్ మోహన్ రామ్‌ను ఒడిశా గవర్నర్‌గా నియమించారు. డాక్టర్ సుధా యాదవ్‌కు కర్ణాటక గవర్నర్ బాధ్యతలు అప్పగించగా, డాక్టర్ ధల్‌సింగ్ బిసెన్‌ను ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమించారు. దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**కేరళ నుంచి తమిళనాడుకు అర్లేకర్**

గవర్నర్ల నియామకాల్లో ప్రధాన మార్పుగా కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సిక్కిం గవర్నర్‌గా పనిచేస్తున్న ఓం ప్రకాశ్ మాథూర్‌ను కేరళకు నియమించారు. దీంతో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గవర్నర్ల బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి.

**కొత్తగా నలుగురికి అవకాశం**

ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు బ్రజ్ మోహన్ రామ్, డాక్టర్ సుధా యాదవ్, డాక్టర్ ధల్‌సింగ్ బిసెన్, దుష్యంత్ గౌతమ్‌లను నియమించారు. ఈ నియామకాలతో ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవులకు కొత్త వ్యక్తులు బాధ్యతలు చేపట్టనున్నారు. గవర్నర్లు రాష్ట్రాల్లో రాజ్యాంగ పరిరక్షణ, శాసనసభ సమావేశాలకు సంబంధించిన రాజ్యాంగపరమైన విధులు, ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన సందర్భోచిత బాధ్యతలు నిర్వహిస్తారు.

**బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే అమలు**

రాష్ట్రపతి భవన్ ప్రకటన ప్రకారం ఈ నియామకాలు సంబంధిత వ్యక్తులు తమ కొత్త పదవుల బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన విధులను నిర్వహించనున్నారు. ఆరు రాష్ట్రాలకు సంబంధించి చేపట్టిన ఈ నియామకాలు, బదిలీలు దేశవ్యాప్తంగా రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**కొత్త గవర్నర్ల జాబితా**

కేరళ -- ఓం ప్రకాశ్ మాథూర్
తమిళనాడు -- రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్
ఒడిశా -- బ్రజ్ మోహన్ రామ్
కర్ణాటక -- డాక్టర్ సుధా యాదవ్
ఉత్తరాఖండ్ -- డాక్టర్ ధల్‌సింగ్ బిసెన్
సిక్కిం -- దుష్యంత్ గౌతమ్

## మారనున్న తిరుపతి స్వరూపం

-మొదటిపేజీ తరువాయి

ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది.

రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

**టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం**

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## స్థానిక సంస్థల ఎన్నికలపై సోషల్ మీడియా విభాగానికి సజ్జల దిశానిర్దేశం

తాడేపల్లి : సోషల్ మీడియా విభాగం కేవలం పోస్టులు పెట్టే వ్యవస్థ కాదు.. పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే శక్తిగా మారాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల



రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సోషల్ మీడియా విభాగం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు దొడ్డా అంజిరెడ్డి, లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. "గ్రామస్థాయి వరకు నెట్‌వర్క్‌ను విస్తరించి, లోకల్ కంటెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎన్నికల్లో ప్రతి ఘటనను విజువల్ ఎవిడెన్స్‌గా రికార్డు చేయాలి. సోషల్ మీడియా పోస్టుల్లో భాష హుందాగా, విషయం బలంగా ఉండాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో సోషల్ మీడియా విభాగం అత్యంత కీలకంగా వ్యవహరించాలి. కంటెంట్ క్రియేట్ చేయడం ఒక్కటే కాదు, పార్టీ నుంచి వచ్చే మెసేజ్‌లను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. సోషల్ మీడియా పార్టీ వ్యవస్థకు శరీరంలో రక్త ప్రసరణలాంటిది. ప్రజా భిప్రాయాన్ని చేరుకోవడంలో, పార్టీ వాదనను ప్రజల ముందు ఉంచడంలో దాని పాత్ర అత్యంత కీలకం. సోషల్ మీడియా విభాగం అన్ని అనుబంధ విభాగాలతో అనుసంధానమై పనిచేయాలి. గ్రామం, మండలం, నియోజకవర్గం వారీగా నెట్‌వర్క్ పెంచాలి.లోకల్ కంటెంట్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి" అని పిలుపునిచ్చారు.

# విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఘోర ప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

కోల్పోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

**రెయిలింగ్‌ను ఢీకొని.. కారులో మంటలు**

ప్రాథమిక సమాచారం ప్రకారం.. వెస్ట్ బైపాస్‌పై ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌ను ఢీకొట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో కారులో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. మంటలు వేగంగా వ్యాపించడంతో అందులో ప్రయాణిస్తున్నవారు బయటపడేందుకు అవకాశం లేకపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణాలు, మంటలు చెలరేగడానికి దారితీసిన పరిస్థితులపై అధికారిక విచారణ పూర్తికావాల్సి ఉంది. వాహనం రెయిలింగ్‌ను ఢీకొట్టిన తీరు, ప్రమాదం జరిగిన సమయంలోని పరిస్థితులు, అగ్నిప్రమాదానికి గల కారణాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

**మృతులు వీరే..**

ఈ ప్రమాదంలో నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాందేవ్ (39), ఆయన తల్లి కొమ్మారెడ్డి అరుణ (56), కొమ్మారెడ్డి మహాత్ర (1), నంబూరుకు చెందిన తిగురు విజయ (48) మృతి చెందినట్లు గుర్తించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. నంబూరులో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమవారు విగతజీవులుగా మారడంతో వారు



కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆర్తనాదాలతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

**ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఎలక్ట్రిక్ కారులో మంటలు చెలరేగి నలుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోడ్డు రెయిలింగ్‌ను కారు ఢీకొట్టడంతో మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా గుర్తించిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**నారా లోకేశ్ సంతాపం**

ఈ దుర్ఘటనపై మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ వెస్ట్ బైపాస్‌పై జరిగిన ప్రమా దంలో నలుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివే సిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మృతులకు నివాళులర్పి స్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: హోంమంత్రి అనిత**

విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నలుగురు మృతి చెందడం బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**ప్రమాదంపై దర్యాప్తు**

ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, వాహనం అదుపుతప్పడానికి గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కారు రెయిలింగ్‌ను ఢీకొన్న తీరు, మంటలు వ్యాపించిన పరిస్థితులు, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించాల్సి ఉంది. ప్రమాదానికి సంబంధించి దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఒకే ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం విజయవాడ పరిసర ప్రాంతాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. క్షణాల్లో జరిగిన ఈ ఘోర ఘటనతో బాధిత కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. గాయపడిన వ్యక్తి

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేసిన పంచకర్ల.






**పెందుర్తి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధి పొందిన 16 మంది లబ్ధిదారులకు 7,64,568 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు వరప్రదాయని శాసనసభ్యులు రమేష్ బాబు పునరుద్ఘాటించారు. పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంప్ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు 7,64,568 లక్షల రూపాయలు చెక్కులను జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి ఆరా తీసిన ఎమ్మెల్యే రమేష్ బాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఆరోగ్యం పరి రక్షణలో కష్టాలు ఎదుర్కొంటున్న ప్రజలకు చేయూతనిందించాలనే లక్ష్యంతో సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని వివరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ నెలకు రెండుసార్లు సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోనూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ఇలా కోట్లాది రూపాయలు ప్రజలకు అందిస్తూ నాయకులు ఇద్దరు సంతోషపడుతున్నారని ఇక నియోజకవర్గంలో తాను కూడా ఎంతో ఆనందంగా ఉన్నానని ఈ పథకం ద్వారా వందలాది మందికి సాయం అందిస్తూ సంతోషం పడుతున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారులు సమీపంలోని ఇతరులకు ఈ పథకం గురించి తెలియజేసి తద్వారా వారు కూడా లబ్ధి పొందేలా ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కువ మందికి లబ్ధి చేకూరితే తాను ఎంతగానో సంతోషిస్తానని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరణం కనకారావు, పెందుర్తి పిఏసిఎస్ చైర్మన్ అయితే సింహాచలం, వార్డు అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్, పెన్నింటి పార్వతి, కంచిపాటి మధు, ఒబ్బిన జనార్ధన శ్రీకాంత్, మాజీ సర్పంచులు మామిడి శంకర్రావు, గజ్జి నరసింగరావు, బోండా తాతారావు, ఆకుల, సుందరపు శ్రీనివాస రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోటి 60 లక్షల రూపాయల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు.






## కూటమికి ఓటు ఇవ్వండి... స్వర్ణ యుగం చూపిస్తాం పంచకర్ల.

**పెందుర్తి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** జీవీఎంసీ పెందుర్తి జోన్ పరిధిలో జీవీఎంసీ 88,93,94,98 వార్డులలో 1 కోటి 60 లక్షల రూపాయల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని జనసేన విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 10 వార్డులో నూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని, తద్వారా వచ్చే మూడేళ్లలో స్వర్ణ యుగం చూపిస్తామని విజ్ఞప్తి చేశారు. సోమవారం పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 88 వ వార్డు వెదుళ్ళ నరవ లో 75 లక్షల రూపాయలతోనూ జీవీఎంసీ 93,94 ,98 వార్డుల పరిధి లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను, జీవీఎంసీ 94 వ వార్డు కృష్ణరాయపురం ఎన్ఏడి లేవట్లలో 85 లక్షల రూపాయలలు జీవీఎంసీ పెందుర్తి జోన్ పరిధిలో మొత్తం 1 కోటి 60 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్థానికులతో మాట్లాడి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డులో ఇంకా చేపట్టాల్సిన పనులు గురించి ప్రజలతో చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే గత రెండేళ్లలో ఒక్కో వార్డులో 50 నుండి 60 కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే వచ్చే మూడేళ్లలో వందలాది కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చి పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎక్కడా ఏ పని మిగిలిపోయి ఉంది అనిపించు కోకుండా పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రజలకు హామీ ఇచ్చారు. కేంద్రం లోని మోదీ ప్రభుత్వం సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన సామర్థ్యంతో, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఉక్కు సంకల్పంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నామని, పరిపాలనను చూసి కూటమికి మద్దతు ఇవ్వాలని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పెందుర్తి జోన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, జనసేన పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇందల రమణ, భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామనాయుడు, రాష్ట్ర కనీస వేతనాలు డైరెక్టర్ బల్రెడ్డి అప్పారావు, పెందుర్తి పిఏసిఎస్ చైర్మన్ ఐత సింహాచలం, మాజీ కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, మొల్లి ముత్యాల, రాపర్తి కన్నా, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నీటిపల్లి మహేష్ , సీనియర్ పాత్రికేయులు రవికాంత్, వార్డు అధ్యక్షులు జనార్ధన శ్రీకాంత్, గంతుకోరు శివ, తదితర నియోజకవర్గం జీవీఎంసీ జోన్ ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు.

- భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి.
- జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్.




**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ లకు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, డి.ఆర్వో వై.సత్యనారాయణ రావు లు జిల్లా లోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అదే విధంగా డివిజన్, మండల, గ్రామ, వార్డు స్థాయి లలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరయి ఆయా స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు అందజేసిన దరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి పరిష్కారం కాని దరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించా లని కలెక్టర్ సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖ కు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి, గడువు లోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉచిత భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, డిఆర్ఓ వై సత్యనారాయణ రావు, పి జి ఆర్ ఎస్, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి.సుదీర్, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా, జిల్లా , ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన నరేంద్ర వర్మ రాజు.




**బాపట్ల, పెన్ సత్తా, అక్టోబర్ 12:** మండల పరిధి లోని తూర్పు పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో సుమారు రూ. 32 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు మరింత సులభంగా, పారదర్శకంగా, వేగంగా అందేలా ఆధునిక వసతులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు తమ పనుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే అన్ని పాలనా సేవలు పొందేందుకు పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం నూతన భవనం లోని కార్యాలయ గదులు, రికార్డుల గది తదితర విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించి, అధికారులకు, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూకాంబికకు పట్టు చీరలు సమర్పించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 12 :** ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో







వెలిసిన నూకాంబిక అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ 10 పట్టు చీరలు అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో మహాశివుడికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ , పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, పైడిరాజు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి, యర్రవరపు సంతోషి కుమారి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో శ్రీ సత్యసాయి జిల్లాకు ప్రతిష్ఠాత్మక అవార్డు.

## కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్.

## రైతులకు రూ.4,992 కోట్ల రుణాల పంపిణీతో జిల్లాకు గుర్తింపు.

**పుట్టపర్తి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీ సత్యసాయి జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. న్యూ ఢిల్లీ లోని నేషనల్ అగ్రికల్చరల్ సైన్స్ కాంప్లెక్స్ (ఎన్ఏఎస్సీ)లో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) జాతీయ స్థాయి పురస్కార ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. జిల్లాలో మొత్తం 3,69,970 మంది రైతులకు రూ.4,992 కోట్ల మేర రుణాలు పంపిణీ చేసినట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక చేయూత అందించడం, సాగు పెట్టుబడుల అవసరాలను తీర్చడం,నాణ్యమైన పంటల సాగును ప్రోత్సహించడం, రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో చేపట్టిన చర్యలకు ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు.రైతుల అభివృద్ధికి మరింత కృషి, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అవార్డు రావడం జిల్లా యంత్రాంగం పై మరింత బాధ్యతను పెంచిందన్నారు. జిల్లా లోని రైతులు సాగు చేస్తున్న పంటల్లో అధిక దిగుబడులు సాధించడంతో పాటు, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆరుగాలం శ్రమిస్తూ వినూత్న పద్ధతుల్లో పంటలు పండించి జిల్లాను వ్యవసాయ రంగంలో ముందుకు తీసుకెళ్తున్న ప్రతి రైతుకూ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## పీజీఆర్ఎస్ పై అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 12**: కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ పై జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం.విశ్వేశ్వర నాయుడు, అదనపు కమిషనర్ సత్యవేణి, నోడల్ ఆఫీసర్ శేష శైలజ, అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. ఇంప్రాపర్ రెడ్రెస్సల్, ప్రీ ఆడిట్, సూపర్ ఆడిట్ ప్రక్రియల్లో తప్పులు దొర్లిన అధికారులను పిలిపించి కలెక్టర్ మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలో వచ్చే వినతులకు నాణ్య మైన పరిష్కారం చూపడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 10 జోన్లకు 10 గ్రీవెన్స్ రెడ్రెస్సల్ అధికారి లాగిన్లు క్రియేట్ చేయాలని ఆదేశించారు. వినతికి సరైన నివేదిక ఇవ్వని, ప్రజలతో నేరుగా మాట్లాడని టాప్ 3 అధికారులను పిలిచి వివరణ కోరారు. విచారణకు హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పీజీఆర్ఎస్ నోడల్ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి రిజిస్ట్రేషన్ సమయంలోనే ప్రజలు ఇచ్చే వినతి ఫిర్యాదు కిందకు వస్తుందా, సర్వీస్ రిక్వెస్ట్ కిందకు వస్తుందా అని పరిగణించి ఆ విధంగానే రిజిస్టర్ చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా పీజీఆర్ఎస్ పై పర్యవేక్షణ చేస్తున్నారని, అధికారులంతా అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ం

## మానవత్వం చాటుకున్న పోలీస్ శాఖ.

- దివంగత హోం గార్డు కుటుంబానికి రూ.3.7 లక్షల ఆర్థిక సాయం.
- జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా చెక్కు అందజేత.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** విధులపట్ల నిబద్ధతతో ఉంటూ, అనారోగ్యంతో అకాల మరణం చెందిన హోం గార్డు కూరాడ రమణ కుటుంబాన్ని ఉమ్మడి జిల్లా పోలీసులు అండగా నిలిచి ఆదుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ మరణించిన రమణ కుటుంబానికి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం తన కార్యాలయంలో రూ.3,71,332 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సహృదయంతో స్పందించిన తోటి హోం గార్డులు ఈ ఆర్థిక సాయం వెనుక అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల హోం గార్డుల సామాజిక స్పృహ ఉంది. తమ తోటి ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఉభయ జిల్లాల హోం గార్డులు తమ ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను స్వచ్ఛందంగా విరాళంగా ప్రకటించారు. ఇతర రూపాల్లో సేకరించిన నిధులతో కలిపి మొత్తం రూ.3,71,332 మొత్తాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా మరణించిన హోం గార్డు భార్య అప్పలమ్మ కి చెక్కును అందజేస్తూ, ఎస్పీ ఆమెను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణ మరణం పోలీసు శాఖకు తీరని లోటు అని, వారి కుటుంబానికి పోలీసు విభాగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. తోటి సిబ్బంది ఆపదలో ఉన్నప్పుడు తోటి హోం గార్డులు స్పందించి సాయం చేయడం అభినందనీయం. విధి నిర్వహణలో మరణించినా లేదా పదవీ విరమణ పొందినా సిబ్బంది సంక్షేమానికి మేము ప్రాధాన్యతనిస్తాం అని తేలిపారు. ?ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ దేవరాజు, జూనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలి.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 12:** యునైటెడ్ గ్రామ వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని కోరుతూ విశాఖ జిల్లా కలెక్టర్ కు పిజిఆర్ఎస్ సందర్భంగా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు జి సుభాషిణి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలు తీవ్ర పనిభారాన్ని భరిస్తున్నారన్నారు. రెండు డిపార్ట్మెంట్ల పనులు చేయలేక తీవ్ర మానసిక ఒత్తిడిని హెల్త్ సెక్రటరీలు అనుభవించే అనుభవిస్తున్నారని, ఈ పని భారాన్ని తగ్గించే విధంగా హెల్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయడం ఒక్కటే పరిష్కారం అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధతో ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అనవసర మైన యాప్లు రద్దు చేయాలని, ఓటిపి విధానాన్ని తీసేయాలని, ఎఫ్ ఆర్ ఎస్ పని ప్రదేశం నుండే వేసే విధంగా చర్యలు చేపట్టాలని, సిపిఎస్ అని రద్దుచేసి ఓ పి ఎస్ అమలు చేయాలని, అర్హులైన హెల్ప్ సెక్రటరీలకు తక్షణం ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈ సామూహిక వినతి పత్రం కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్న, ప్రభావతి, ముఖ్య నాయకులు నిర్మల, రాజ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

# పశుగ్రాస సాగుకు రైతులకు ఎకరానికి రూ.69 వేల ఆర్థిక సహాయం.



ప్రభుత్వ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి డా. రామకృష్ణ కీర్తి.






**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 12:** పాడి పశువులకు నాణ్య మైన పచ్చిమేత అందించడంతో పాటు, పశుపోషణ ఖర్చులను తగ్గించి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ప్రభుత్వం విబిజి రామ్ జి పథకం ద్వారా పశు గ్రాస సాగుకు ఆర్థిక సహాయం అందిస్తోందని పరవాడ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డా. రామకృష్ణ కీర్తి తెలిపారు. పరవాడ మండలం లోని అర్హులైన పాడి రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ పథకం కింద రైతులకు రెండు సంవత్సరాలకు కలిపి ఎకరానికి సుమారు రూ.69,000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన భూమిలో సూపర్ నేపియర్ (కణుపు గడ్డి) మాత్రమే సాగు చేయాలని, ఇతర రకాల గడ్డిని సాగు చేయడానికి అనుమతి లేదని వివరించారు. పశుగ్రాస సాగుకు దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్ కార్డు, జాబ్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, వన్ బీ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను సమర్పించాలి. భూమి తప్పనిసరిగా రైతు స్వంత పేరు పై ఉండాలని, పశుగ్రాస సాగుకు ఎంపిక చేసిన భూమి ఖాళీగా ఉండాలని తెలిపారు. అర్హతలు కలిగిన రైతులు అవసరమైన పత్రాలతో వాడచీపురుపల్లి, లంకెలపాలెం పశు వైద్యాధికార్లను సంప్రదించి పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలని డా. రామకృష్ణ కీర్తి సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లభించే అవకాశాలను వినియోగించుకుని పాడి అభివృద్ధికి, రైతుల ఆదాయం పెంపునకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు శుభవార్త

Agri Gold
VICTIMS

**అమరావతి, అక్టోబర్ 12**: 9 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం చంద్రబాబు ప్రభుత్వం, నేరుగా బాధితుల ఖాతాల్లోకి డబ్బులు!. ఏపీ లోని అగ్రిగోల్డ్ బాధితులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఆ సంస్థకు సంబంధించిన భూములను విక్రయించి.. వచ్చిన డబ్బుతో బాధితుల బకాయిలు క్లియర్ చేయాలని సీఐడీ అధికారులకు అదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వడ్డీల ఆశ చూపి ఏజెంట్ల ద్వారా అగ్రిగోల్డ్ సంస్థ వందల కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించిన సంగతి తెలిసిందే. ఏజెంట్లకు కమీషన్లు ఇస్తూ పెద్ద ఎత్తున నిధులు వసూలు చేసిన ఆ సంస్థ, సకాలంలో డిపాజిట్‌దారులకు డబ్బులు తిరిగి చెల్లించలేక చేతులెత్తేసింది. డిపాజిట్ల రూపంలో వచ్చిన డబ్బుతో అగ్రిగోల్డ్ భారీగా భూములను కొనుగోలు చేసింది ఎలాంటి వివాదాలు, సమస్యలు లేని అగ్రిగోల్డ్ భూములను విక్రయించి, ఆ ద్వారా వచ్చే మొత్తంతో బాధితులకు బకాయిలు చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు కర్నూలు ప్రాంతీయ సీఐడీ అధికారులు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇక ప్రభుత్వ ఆదేశాలతో రంగం లోకి దిగిన సీఐడీ అధికారులు అగ్రిగోల్డ్ బాధితులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# లంకెలపాలెం -పరవాడ రోడ్లు నిర్మాణం వెంటనే చేయాలి.

- సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గనిశెట్టి, జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు.

**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 12:** లంకెలపాలెం నుండి పరవాడ, పరవాడ ఎన్టిపిసి రోడ్లను వెంటనే నిర్మాణ పనులను చేపట్టాలని, పెద్ద పెద్ద గోతులతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు అనుభవిస్తున్నారని సోమవారం జిల్లా కలెక్టర్ కి సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆర్ అండ్ బి ఈ ఈ రంగయ్య కి ఫిర్యాదు అందజేయడం జరిగింది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గనిశెట్టి కోరారు. లంకెలపాలెం బ్రిడ్జి మధ్యలో పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయని, ఎస్సీ జడ్ జంక్షన్, సింహాద్రి జంక్షన్, ఎంఆర్ఓ ఆఫీస్ జంక్షన్, సబ్ స్టేషన్, సినిమాలు జంక్షన్, ఎన్ టి పి సి జంక్షన్, సోమనాయుడుపాలెం ప్రాంతాల్లో పెద్దపెద్ద గోతుల వలన ద్విచక్ర వాహనదారులు ప్రయాణించడం కష్టంగా మారిందని, దుమ్మి దూళి కంట్లో పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హిందుజా బొగ్గు లారీలు, ఎన్టిపిసి ఫ్లయాష్ లారీలు అధిక లోడుతో ప్రయాణించడం వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, వెంటనే రోడ్ల మరమ్మత్తు చేయడంతో పాటు పరిమితికి మించి అధిక లోడుతో వెళ్లే వాహనాలను నిలుపుదల చేయాలని గనిశెట్టి కోరారు. రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వెంటనే రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టడానికి పరిశీలిస్తున్నామని ఈ ఈ రంగయ్య గనిశెట్టి కి హామీ ఇచ్చారు.



# కామాక్షి దేవి ఆలయంలో గాయత్రి దేవిగా అలంకరణ.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** నిదానదొడ్డి లో వేంచేసియున్న కామాక్షి దేవి దసరా నవరాత్రి మహోత్సవాలు భాగంగా సోమవారం అమ్మవారు భక్తులకు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షులు పొన్నాడ వెంకట సత్యనరసింహ ఆచారి (పెదబాబు), ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిల్లాడ శ్రీనివాసరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు వెదురుపాటి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన కన్యకా పరమేశ్వరి



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** పట్టణంలో ప్రసిద్ధి చెందిన వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవం సోమవారం రెండవ రోజు అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు, ఆలయ మండపంలో బేడసేవ, శ్రీ చక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించారు. సరస్వతి దేవి పూజ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పెన్సిళ్లు, స్కేలు పరీక్ష అట్ట పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు



వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

# పీ4 లో బీసీ యువతకు ఉచిత సివిల్స్ కోచింగ్ మంత్రి సవిత'





- త్వరలో డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభం.
- బీసీ యువత ఉన్నత స్థానాల్లో కొలువుదీరాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం.
- బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ మంత్రి సవిత.
- పీ4 విధానంలో బీసీ అభ్యర్థులకు ఉచిత సివిల్స్ కోచింగ్.
- డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ, బీసీ సంక్షేమశాఖ మధ్య ఒప్పందం.
- మంత్రి సవిత సమక్షంలో ఎంవోయూ.
- ఏటా వంద మందికి శిక్షణతో పాటు మెటీరియల్ అందజేత.
- ఉచిత వసతి కల్పించనున్న ప్రభుత్వం.

**అమరావతి, అక్టోబర్ 12 :** దేశం లోనే తొలిసారిగా పీ4 మోడల్ లో బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం ప్రఖ్యాత గాంచిన డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీతో బీసీ సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ సందర్భంగా మెటీరియల్ ఉచితంగా ఇవ్వడంతో పాటు అభ్యర్థులకు నిష్ణాతులైన అధ్యాపకులు బోధించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సచివాలయం లోని మంత్రి సవిత సమక్షంతో డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖాధికారులు పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ బీసీలను అన్ని రంగాల్లోనూ ముందు ఉంచాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా బీసీల కులాల సంక్షేమానికి పలు పథకాలు అమలుచేస్తున్నారన్నారు. బీసీ యువత ఉన్నత స్థానాల్లో కొలువుదీరాలన్న ఉద్దేశంతో సివిల్స్ సర్వీసెస్, డీఎస్సీ, గ్రూప్ 1, పోలీస్ డిపార్ట్ మెంట్ లో ఉద్యోగాల కోసం బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 మోడల్ లో బీసీ యువతకు ఉచిత సివిల్స్ శిక్షణ అందించడానికి దేశంలో ప్రఖ్యాత గాంచిన డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సివిల్స్ శిక్షణ సందర్భంగా డాక్టర్ లక్ష్మయ్య అకాడమీ మెటీరియళ్లతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులతో వివిధ సబ్జెక్టుల పై బోధన అందించనున్నారన్నారు. డీఎస్సీ సహా ఇతర పోటీ పరీక్షలకు త్వరలో ఉచిత శిక్షణ:

2014-19లో బీసీ నిరుద్యోగ యువతకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని మంత్రి సవిత గుర్తు చేశారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఉచిత సివిల్స్ కోచింగ్ నిలిపేసిందన్నారు. దీంతో బీసీ నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పాలైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే, ఉచిత సివిల్స్ కోచింగ్ ను పునరుద్ధించిందన్నారు. గడిచిన రెండేళ్లలో 200 మందికి ఉచిత సివిల్స్ కోచింగ్ అంజేశామన్నారు. 2025 మెగా డీఎస్సీకి, గ్రూప్ 1కు కూడా ఉచిత శిక్షణ అందజేశామన్నారు. త్వరలో సివిల్స్ ఉచిత కోచింగ్ ప్రారంభించనున్నామన్నారు. ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వంద మందికి ఉచిత వసతితో కూడిన శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డీఎస్సీ నోఫికేషన్ రాగానే ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆఫ్ లైన్, ఆన్ లైన్ ద్వారా ఈ శిక్షణ అందజేయనున్నామన్నారు. ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షలకు కూడా ఉచిత శిక్షణ అందించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. కార్యక్రంలో పాల్గొన్న పీ4 ఫౌండేషన్ వైఎస్ చైర్మన్ కుటుంబరావు మాట్లాడుతూ ఉచిత సివిల్స్ కోచింగ్ మెయిన్స్ కు ఎంపికైన బీసీ అభ్యర్థులకు రూ.రెండు లక్షల చొప్పున వ్యక్తిగతంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పీ4 విధానంలో బీసీలను అన్నిరంగాల్లోనూ ముందు ఉంచాలన్నది సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. పార్థ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు భాగవతుల రవి కుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆశయ సాధనలో భాగంగా బీసీ విద్యార్థులకు ఉచిత సివిల్స్ కోచింగ్ అందజేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ చీఫ్ మెంటార్ లక్ష్మయ్య మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు సివిల్స్ కు మెరుగైన శిక్షణ అందజేస్తామన్నారు. ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా కలిసి, వారికి శిక్షణ అందజేస్తామన్నారు. ఏపీ గెజిటెడ్ జేఏసీ చైర్మన్ కేవీ కృష్ణయ్య మాట్లాడుతూ, తమ ఉద్యోగ సంఘ తరపున పలువురు విద్యార్థులకు పీ4 విధానంలో సివిల్స్ కోచింగ్ అందజేస్తామని తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత సమక్షంలో ఒప్పంద పత్రాలపై బీసీ సంక్షేమ శాఖ అధికారులు, డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ ప్రతినిదులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# లంకెలపాలెం ఫ్లై ఓవర్ పై మరణించిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించిన పంచకర్ల.





**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 12:** లంకెలపాలెం ఫ్లై ఓవర్ పై ప్రమాదవశాస్తు మరణించిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించిన పంచకర్ల రమేష్ బాబు. బాధిత కుటుంబానికి అండగా ఎమ్మెల్యే సొంత నిధులతో 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేత. ఇటీవల 106 వ వార్డు లంకెలపాలెం గ్రామంలో బ్రిడ్జి (ఫ్లై ఓవర్) పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కత రాజు కుటుంబాన్ని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గ శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోమవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి– హాస్పిటల్ నిమిత్తం రూ. 20 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, జనసేన పార్టీ తరపున రూ. 5 లక్షల ప్రమాద బీమా తన సొంత నిధుల నుండి రూ. 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు.

అంతే కాకుండా, ఆ కుటుంబంలో ఉన్న బిడ్డల భవిష్యత్తుకు అండగా ఉంటామని, వారి ఉద్యోగ భవిష్యత్తుకు హామీ ఇస్తున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, 106 వ వార్డు జనసేన నాయకులు సుందరపు శ్రీనివాసు, గొన్న రమాదేవి, దుల్ల రాము నాయుడు, కర్రి బుజ్జి, అన్నపూర్ణ, శేఖర్ రెడ్డి తదితర గ్రామ స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్నికల కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పటిష్ట మైన ఏర్పాట్లు చేపట్టాలి.

- ఆంధ్ర విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.
- కౌంటింగ్ గదులు, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్, ఫుడ్ కౌంటర్ల ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు.
- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో రిసెప్షన్, అటెండెన్స్, పోలీస్, ఫుడ్ కౌంటర్లు, పార్కింగ్ సదుపాయాలు కల్పించాలి.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 12:** జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ క్యాంపస్ లోని కౌంటింగ్ కేంద్రాలను, అన్ని జోన్ల పరిధి లోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను పటిష్టంగా సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్ అదనపు కమిషనర్లు, ప్రధాన ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్, అందరు జోనల్ కమిషనర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయ క్యాంపస్ లోని న్యూ క్లాస్ రూమ్ బ్లాక్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎకనామిక్స్, ప్రిన్సిపల్ బ్లాక్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్, ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ తదితర బ్లాకులను,విభాగాలను కమిషనర్ విస్తృతంగా పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియకు అనువైన గదులను గుర్తించి, తగినంత గాలి, వెలుతురు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కౌంటింగ్ గదుల్లో ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేపట్టాలని, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాలు, ఫుడ్ కౌంటర్లను అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ గదులు, రూట్ మ్యాప్‌ల వివరాలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలని, అదనపు కమిషనర్లు, ప్రధాన ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్, అందరు జోనల్ కమిషనర్లు, సంబంధిత ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏర్పాట్లను సమీక్షించాలని సూచించారు. ఎటువంటి లోపాలకు తావులేకుండా అవసరమైన సదుపాయాలను ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో, ఎన్నికల నిర్వహణకు అవసర మైన బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని అన్ని జోన్ల పరిధిలో నిర్దేశించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఇప్పటికే తరలించినట్లు కమిషనర్ తెలిపారు. ఆయా కేంద్రాల్లో రిసెప్షన్ సెంటర్, అటెండెన్స్ కౌంటర్, ఫుడ్ కౌంటర్, పోలీస్ కౌంటర్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను అందరు జోనల్ కమిషనర్లు స్వయంగా పరిశీలించి, అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట మైన ముందస్తు చర్యలు చేపట్టాలని, సామగ్రి పంపిణీ, సిబ్బంది రాకపోకలు సజావుగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మేయర్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ దయానిధి, అదనపు కమిషనర్లు కే. రమేష్, డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ, ప్రధాన ఇంజినీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు, అందరు జోనల్ కమిషనర్లు, పర్యవేక్షక ఇంజినీర్లు, డిప్యూటీ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ ప్లానర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ప్లానింగ్ అధికారులు, అమెనిటీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.





# బాలా త్రిపుర సుందరి దేవిగా దుర్గమ్మ.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు లో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవంలో భాగంగ సోమవారం రెండవ రోజు అమ్మవారికి బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయగిరి చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు కె హరి నారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం రథం పై అలంకరణ చేశారు. పది రోజులపాటు ఆలయం నుండి బయల్దేరి రథోత్సవం వాడవాడల తిరుగుతూ దసరా రోజు పూడిమడ రోడ్ లో ఉన్న రామాలయం కి చేరుకుంటుంది. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నైటు బ్రదర్స్ ఆర్థిక సహకారంతో మాల ధారణ చేసిన భవానీ భక్తులకు నవరాత్రి పది రోజులు అన్న సమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు,శ్రీ గౌరీ పరమేశ్వరి కమిటీ, శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజా టెంట్ హౌస్, శ్రీ మరిడమాంబ ఉత్సవ కమిటీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గౌరీ పంచాయతన దేవాలయంలో సరస్వతి దేవిగా అమ్మవారు






**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** గౌరీ పంచాయతన దేవాలయంలో శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు భాగంగా సోమవారం అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ , అంపోలు రాంప్రసాద్ శర్మ, కోట శ్రీకర్ శర్మ ఆధ్వర్యంల అమ్మవారు భక్తులకు సరస్వతి దేవిగా చిన్నారులకు సామూహిక సరస్వతి దేవి పూజ సందర్భంగా పుస్తకాలు పంపిణీ చేశారు. రెండవ రోజు అమ్మవారిని గా భక్తులకు అమ్మవారు సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారి దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల ప్రసాద్, పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

# కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం.





**విసుఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 12:** జి.ఐ. ప్రొఫైల్ షీట్ షెడ్ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాన్. దక్షిణ నియోజకవర్గ పరిధి లోని బురుజుపేటలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ పరిసరాల్లో రూ.43.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జి.ఐ. ప్రొఫైల్ షీట్ షెడ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, ఆలయ చైర్మన్ కందుల నాగరాజు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఎమ్ ఎన్ ఎస్ పోర్టు ఏర్పాటుతో మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీయవద్దు.





సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు

**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 12:** ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ పోర్ట్ ఏర్పాటుతో మత్స్యకారుల జీవనోపాధికి దెబ్బతీయవొద్దని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం అన్నారు.ఈ నెల 15 వ తేదీ న ఏర్పాటు చేసే గ్రీన్ ఫీల్డ్ క్యాప్టీవ్ పోర్ట్ ప్రజాభిప్రాయ సేకరణ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్ లతోను మరియు స్థానిక మత్స్యకారులతో కలిసి డి ఎల్ పురం లో పోర్టు ఏర్పాటు చేసే ప్రాంతంలో పర్యటించి మత్స్యకారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా, చట్టాలను రాజ్యాంగాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా వాస్తవాలు మత్స్యకారులకు, సాగు దార్లు, కూలీలకు తెలియజేయకుండా పోర్టు కొరకు ప్రజాభిప్రాయ సేకరణ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మూడు కిలోమీటర్లు సముద్ర తీరాన్ని ప్రైవేటు పరిశ్రమలకు పోర్టు ఏర్పాటు చేసు కోవడానికి ఏ విధంగా ఇస్తారని,మన జాతి , ప్రకృతి సంపద ఏ విధంగా కార్పొరేట్ కంపెనీకి ధారాదత్తం చేస్తారని ప్రశ్నించారు.నక్కపల్లి మండలం లో బంగారమ్మపేట, డి ఎల్ పురం, అమలాపురం, బోయపాడు, రాజయ్య పేట గ్రామాలలో 35 వేల మంది మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళడానికి అవకాశం లేక ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలుష్య నియంత్రణ మండలి వారు ప్రవేశ పెట్టిన సామాజిక ప్రభావ అంచనా నివేదిక అంతా తప్పులు తడకగా ఉందని చెప్పారు.ఆ నివేదిక లో మత్స్యకారులు, రైతులు, కూలీలు ఉపాధి, ఉద్యోగాలు గురించి ఎక్కడా ప్రస్తావించలేదని కానీ ప్రభుత్వం ఇక్కడ స్టీల్ ప్లాంట్, పోర్టు ఏర్పాటు చేస్తే స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం మత్స్యకారుల మీద పెద్ద ఎత్తున యుద్ధం ప్రకటించిందని డి ఎల్ పురం, నిల్లిపూడి, గునుపూడి, అమలాపురం, చందనాడ, బోయపాడు, రాజయ్య పేట గ్రామాలను ఆనుకొని పోర్టు నిర్మాణం చేపడితే ఆ గ్రామాలలో ప్రజలు ఎలా నిర్వహిస్తారని తెలిపారు, ఇప్పటికే రాష్ట్రంలో పోర్టు లు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వాయు కాలుష్యము వెదజల్లి పర్యావరణ పాడై కాలుష్యం కారణంగా ప్రజలు అనేక రకాల రోగాలు బారిన పడి తీవ్రంగా అనారోగ్యాలు బారిన పడుతున్నారని ఈ ప్రాంతంలో కూడా అభివృద్ధి కంటే, ఉపాధి కంటే అనార్థాలే ఎక్కువుగా ఉంటాయని తెలిపారు.

మత్స్యకారుల జీవనోపాధిని, ప్రజలు ప్రాణాలు ధ్రుష్టిలో పెట్టుకుని అక్టోబర్ 15 వ తేదీన జరిగే ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# ధర్మవరంలో కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆందోళన



మహిళల గౌరవం, భద్రతపై కాంగ్రెస్ నేతలు స్పందించాలి: జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ బాలగిరి బిరే వరలక్ష్మి

మహిళల ఆత్మగౌరవం విషయంలో ద్వంద్వ ప్రమాణాలు తగవు.. రాహుల్ గాంధీ స్పందించాలని బీజేపీ డిమాండ్

**ధర్మవరం,అక్టోబర్ 12 (పెన్ సత్తా)** కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ ధర్మవరంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జి.ఎం. శేఖర్ సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు.ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోంచా బిమోల్ అకోయిజామ్‌పై మహిళా విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనపై తీసుకున్న చర్యలపై నిరసనకారులు స్పందించారు.ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి బీరే విజయలక్ష్మి మాట్లాడుతూ, మహిళా సాధికారత గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకులు మహిళల గౌరవానికి సంబంధించిన తీవ్రమైన ఆరోపణలపై కూడా బాధ్యతాయుతంగా స్పందించాలని అన్నారు.మహిళల ఆత్మగౌరవం,భద్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, మహిళలకు న్యాయం జరిగేలా సంబంధిత నాయకులు తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.మహిళల గౌరవాన్ని కాపాడే విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింక చంద్రశేఖర్,జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు,జిల్లా కార్యదర్శి బీరే విజయలక్ష్మి,జిల్లా యువమోర్చా అధ్యక్షుడు బిల్లు కుళ్లాయప్ప యాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జగ్గ నాగరత్నమ్మ,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొట్లూరు అనిల్,మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నబీ రసూల్,పట్టణ ఉపాధ్యక్షుడు నాగభూషణ,పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్,ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల భాయ్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి,ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఓం ప్రకాష్ గౌడ్, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మైసూర్ హరీష్,జిల్లా కార్యదర్శి పి. నాగప్రదీప్,మహిళా మోర్చా ముదిగుబ్బ మండల అధ్యక్షురాలు సమీరా మౌలాబి, మాధవి,గంగమ్మ, అరవింద్ రెడ్డి,చరణ్, బిళ్ళే చంద్ర,ఈశ్వర్ నాయక్,బండ్లపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఐఎన్‌టీయూసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తుంపర్తి పరమేష్ డిమాండ్



**ధర్మవరం,అక్టోబర్ 12 (పెన్ సత్తా)**పట్టణంలో కాంగ్రెస్ పార్టీ,అఖిలపక్షం ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ కాంగ్రెస్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు తుంపర్తి పరమేష్ నేతృత్వంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా తుంపర్తి పరమేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అలుపెరగని పోరాటం చేస్తున్నారని తెలిపారు.ఆయన పోరాటానికి దేశ ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా చైతన్యవంతులై బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కృషి చేయాలని కోరారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు,వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగార్జున, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర,సుకృత్, ఏఐఎస్‌బీ స్టేట్ కౌన్సిల్ ప్రతినిధులు, బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు వినయ్, రాంప్రసాద్,బీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, ఎస్సీ జనసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిసార్ అహ్మద్,పీసీసీ డెలిగేట్,కేకేసీ జిల్లా అధ్యక్షుడు కాటమయ్య,అనిల్, యూత్ కాంగ్రెస్ నాయకులు,దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు నరసింహులు,కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోవిందరాజు, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ శీన, పెద్దన్న,మసూద్, బాబ్జాన్,కాజా ఇమ్రాన్,రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ అసెంబ్లీ సమన్వయకర్తగా కొండా దుర్గమ్మ ఎంపిక

**ధర్మవరం,అక్టోబర్ 12 (పెన్ సత్తా)**జనసేన పార్టీ అసెంబ్లీ సమన్వయకర్తగా కొండా దుర్గమ్మను మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి పార్లమెంట్ కోఆర్డినేషన్ కమిటీ వారికి అందించేందుకు ఈ కమిటీని జనసేన పార్టీ అధ్యక్షులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకోవడం జరిగిందని కార్యాలయ వర్గాలు తెలిపారు.అనంతరం కొండా దుర్గమ్మ మాట్లాడుతూ,జనసేన పార్టీ నాపై ఉంచిన ఈ బాధ్యతను పార్టీ అభివృద్ధి కొరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో తన వంతుగా సహకరిస్తానని వారు స్పష్టం చేశారు.ఈ ఎంపికకు సహకరించిన అందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు.



# అక్టోబర్ 16 ఉచిత గుండె శిబిరం

ఆత్మీయ ట్రస్ట్ యుటిఎఫ్ నాయకులు



**ధర్మవరం,అక్టోబర్ 12 (పెన్ సత్తా)**ఆత్మీయ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ ధర్మవరం డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 16వ తేదీ శుక్రవారం రోజున అనంతపురం నగరానికి చెందిన మార్క్ హాస్పిటల్ సౌజన్యంతో ధర్మవరం పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించబడునని ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి తెలియజేశారు.ఈ సందర్భంగా ఉచిత గుండె వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం రోజున యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి మరియు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అమర్ నారాయణరెడ్డి స్థానిక యుటిఎఫ్ నాయకులు ఆత్మీయ ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ, ఈ మెడికల్ క్యాంపు నందు నందు ఉచితంగా షుగర్, బిపి,ఈసీజీ,2డి ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించబడును అని ఈ పరీక్షలు మార్క్ హాస్పిటల్ వారి సౌజన్యంతో చేయబడునని తెలియజేశారు. క్యాంపుకు హాజరయ్యేవారు ముందస్తుగా 9030944717 ,94417 34907 చరవాణి లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అమర్ నారాయణరెడ్డి ధర్మవరం డివిజన్ యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులు, వెంకట కిషోర్,జింక హరికృష్ణ,సకల చంద్రశేఖర్, పెద్దకొట్లసురేష్, లక్ష్మీనారాయణ,జిల్లా జన విజ్ఞాన వేదిక నాయకులు చంద్ర శేఖర్ రెడ్డి ఆత్మీయ ట్రస్ట్ ప్రతినిధి హర్షిత్ ప్రణవ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా విభాగం పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే శక్తిగా మారాలి

**తాడేపల్లి : (పెన్ సత్తా)**నున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ సోషల్ మీడియా విభాగం అత్యంత కీలకమైన బాధ్యతను నిర్వహించాలని పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియా విభాగంలో బాధ్యతలు నిర్వహించే వారు సాధారణ కార్యకర్తల కంటే భిన్నంగా కంటెంట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగే ఆర్గనైజర్లుగా పనిచేయాలని సజ్జల సూచించారు. కంటెంట్ క్రియేట్ చేయడం ఒక్కటే కాకుండా, పార్టీ నుంచి వచ్చే మెసేజ్‌ను వెయ్యి మందికా, పదివేల మందికా, లక్ష మందికా ఎంత వేగంగా తీసుకెళ్లగలుగుతున్నామన్నదే అసలు సామర్థ్యమని చెప్పారు. సోషల్ మీడియా ప్రస్తుతం పార్టీ వ్యవస్థకు శరీరంలో రక్తప్రసరణలాంటి పాత్ర పోషిస్తోందని, ప్రజాభిప్రాయాన్ని చేరుకోవడంలో, పార్టీ వాదనను ప్రజల ముందు ఉంచడంలో దాని పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సోషల్ మీడియా విభాగం అన్ని అనుబంధ విభాగాలతో అనుసంధానమై పనిచేయాలని చెప్పారు.

గ్రామం, మండలం, నియోజకవర్గం వారీగా నెట్‌వర్క్ పెంచాలి

ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గంలో సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని సజ్జల సూచించారు. ప్రతి కార్యకర్త తనకు అందిన పార్టీ సందేశాన్ని ఎంతమందికి చేరవేయగలుగుతున్నాడో స్పష్టంగా గుర్తించుకోవాలని చెప్పారు.

రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న సోషల్ మీడియా కమిటీలను ఉపయోగించి, ప్రతి ప్రాంతానికి ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పార్టీ కంటెంట్‌ను నేరుగా గ్రౌండ్ లెవెల్‌కు తీసుకెళ్లాలని సూచించారు.

లోకల్ కంటెంట్‌కు ఎక్కువ ప్రాధాన్యం

రాష్ట్రస్థాయి సాధారణ రాజకీయ సందేశాలతో పాటు స్థానిక సమస్యలే ప్రజలపై ఎక్కువ ప్రభావం చూపుతాయని సజ్జల చెప్పారు. ఒక గ్రామంలో పెన్షన్లు తొలగించడం, స్థానికంగా సంక్షేమ ప్రయోజనాలు అందకపోవడం, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల ఫీజులు, రైతుల ఇబ్బందులు, ధరల పెరుగుదల, స్థానిక నాయకులపై ఉన్న ఆరోపణలు వంటి అంశాలను వాస్తవ ఉదాహరణలు, గణాంకాలతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

మహిళా విభాగం మహిళల సమస్యలపై, యువజన విభాగం నిరుద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై, రైతు విభాగం రైతు సమస్యలపై కంటెంట్ రూపొందిస్తే, సోషల్ మీడియా విభాగం ఆ కంటెంట్‌ను విస్తృతంగా డిస్ట్రిబ్యూట్ చేయాలని చెప్పారు.

స్థానికంగా మాట్లాడగలిగే వారిని గుర్తించాలి

గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో మంచి విషయ పరిజ్ఞానం ఉండి, స్పష్టంగా మాట్లాడగలిగే వారిని గుర్తించి ప్రోత్సహించాలని సజ్జల సూచించారు. పార్టీ విభాగాలకు చెందిన వారితో పాటు, ప్రజా సమస్యలపై మాట్లాడగలిగే రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, స్థానిక ఇన్‌ఫ్లూయన్సర్లను గుర్తించి వారి ద్వారా వీడియోలు, టెస్టిమోనియల్స్ రూపొందించాలని చెప్పారు. అలాంటి వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా పరిచయం చేసి వారి రీచ్ పెంచడం ద్వారా పార్టీకి ఉపయోగపడే బలమైన లోకల్ వాయిస్‌లను తయారు చేయాలని అన్నారు.

ఎన్నికల్లో విజువల్ ఎవిడెన్స్ అత్యంత కీలకం

స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు ఎక్కడైనా అడ్డంకులు, అధికారుల దుర్వినియోగం, పోలీసుల జోక్యం లేదా ప్రత్యర్థుల దౌర్జన్యాలు జరిగితే వాటిని తప్పనిసరిగా వీడియో రూపంలో రికార్డు చేయాలని సజ్జల సూచించారు.

ఈ విజువల్ ఎవిడెన్స్‌ను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు, కోర్టుల్లో న్యాయపరమైన చర్యలకు కూడా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. గ్రామస్థాయి కార్యకర్త వరకు ఎక్కడ ఏ ఘటన జరిగినా దాన్ని వెంటనే రికార్డు చేసి సోషల్ మీడియా నెట్‌వర్క్‌కు చేరవేసే వ్యవస్థ ఉండాలని సూచించారు.

సోషల్ మీడియా కార్యకర్త అభ్యర్థికి అండగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో సోషల్ మీడియా కార్యకర్తలు కేవలం ఆన్‌లైన్‌కే పరిమితం కాకుండా, నామినేషన్ నుంచి పోలింగ్ ఫలితాల వరకు పార్టీ అభ్యర్థులకు అండగా ఉండాలని సమావేశంలో పిలుపునిచ్చారు. అభ్యర్థి పేరు, గుర్తు, స్థానిక సమస్యలు, ప్రచార కార్యక్రమాలను సోషల్ మీడియాలో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల్లో సోషల్ మీడియా పనితీరును వచ్చే సాధారణ ఎన్నికలకు ఒక డ్రెస్ రిహార్సల్‌గా తీసుకోవాలని సజ్జల పేర్కొన్నారు.

విమర్శల్లో విషయం ఉండాలి.. భాష హుందాగా ఉండాలి

సోషల్ మీడియా పోస్టుల్లో ఆవేశానికి లోనై వ్యక్తిగత దూషణలకు వెళ్లవద్దని సజ్జల ప్రత్యేకంగా సూచించారు.

## సంపాదకీయం

# పీఠభూమి ప్రయాణం!

పీఠభూమి మీద ప్రయాణిస్తున్నంత మాత్రాన.. ఆ దారిలో ఎగుడుదిగుళ్లు ఉండవని కాదు. భారత, అమెరికా అధికారులు ఇప్పుడు అనుభవిస్తున్నది ఇదే. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ "పీఠభూమి"గా అభివర్ణించిన దారిలో, వారు గుంతలనూ, గుడ్డి మలుపులనూ దాటుకుంటూ ముందుకెళ్తున్నారు. సెప్టెంబర్ 24న కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, వాణిజ్య ఒప్పందం "దాదాపు పూర్తయినట్టే" (డన్ అండ్ డస్టెడ్) అని ప్రకటించారు. కొద్ది రోజులకే మిల్వాకీలో జరిగిన జీ-20 వాణిజ్య మంత్రుల సమావేశం తర్వాత అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్, చర్చలు "చివరి దశ"లో ఉన్నాయని చెబుతూనే, ఒప్పందం "ఇప్పట్లో కుదిరే అవకాశం లేదు" అన్నారు. సమస్యాత్మక అంశాలను గుర్తించామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయం, పాడి రంగాల్లోకి ప్రవేశం కల్పించాలన్న అమెరికా ఒత్తిడిని భారత్ ప్రతిఘటించడం గతంనుంచీ ఉన్న ప్రధాన అడ్డంకి. ఈ ఉద్రిక్తత చల్లారకముందే అక్టోబర్ 8న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, వీసా మోసాలపై జరిగిన విలేకరుల సమావేశంలో హెచ్-1బీ వీసా కార్మికులను "ఇండెంచర్డ్ సర్వెంట్స్"గా అభివర్ణించారు; విదేశీ ఔట్‌సోర్సింగ్ సంస్థలు అమెరికా కార్మికుల వేతనాలను తగ్గిస్తున్నాయని ఆరోపించారు. అదే సమయంలో అమెరికా కార్మిక శాఖ ఎనిమిది సంస్థలను శాశ్వత కార్మిక ధృవీకరణ (పెర్మ్) ప్రక్రియ నుంచి సస్పెండ్ చేసింది. విదేశాంగ శాఖ వెంటనే స్పందిస్తూ, ఆ పదజాలం "అనవసరమైనది", "తీవ్ర అభ్యంతరకరమైనది", వలసపాలన నాటి బాధాకర జ్ఞాపకాలను రేకెత్తిస్తుందని పేర్కొంది. అమెరికాలోని భారతీయ నిపుణులు ఉన్నత విద్యావంతులు, నైపుణ్యం కలవారని, ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆవిష్కరణల వాతావరణానికి గణనీయంగా తోడ్పడుతున్నారని గుర్తుచేసింది. పెర్మ్ సస్పెన్షన్ వల్ల హెచ్-1బీ వీసాల చెల్లుబాటుపై ప్రభావం లేదని కూడా స్పష్టం చేసింది.

ఈ గందరగోళం వెనుక ఉన్న పెద్ద చిత్రాన్ని చూడాలి. ఒక విశ్లేషకుడి వాదన ప్రకారం, అమెరికా.. చైనాను ఎదుర్కోవడంలో, ఆధునిక సాంకేతికతలో తమకు తోడ్పడుతుందని, వికసిత భారత్‌కు ఉచిత ప్రయాణం ఇస్తుందని భారత విధాన వర్గాలు, ఆకాంక్షాత్మక మధ్యతరగతి భావించే "ఆధారపడే మనస్తత్వం" నుంచి మనం బయటపడాలి. "మాగా" (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్), "మిగా" (మేక్ ఇండియా గ్రేట్ ఎగైన్) ఒకే శరీరానికి రెండు చేతులన్న భావనగా చూడకూడదు. బుష్ కాలంలోని పౌర అణు ఒప్పందానికి ఆ అవగాహనే పునాది అయినా, ఆ కాలం ముగిసిందన్నది ఆయన విశ్లేషణ. గత దశాబ్దంలో అమెరికా ప్రభుత్వాలు భాగస్వామ్యానికి "బిల్లులు" పంపుతూనే ఉన్నాయని, భారత్ వాటిలో కొన్నింటిని చెల్లించిందని, రక్షణ పరికరాలు కొనుగోలు చేసిందని, కొన్ని ఉత్పత్తులపై సుంకాలు తగ్గించిందని, ఇరాన్, వెనిజువెలా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేసిందని గుర్తుంచుకోవాలి. ఈ దృష్టిలో, ఒక పాకిస్తాన్ సైనిక అధికారిని శ్వేతసౌధంలో భోజనానికి పిలవడమే భారత్‌కు నిజమైన మేలుకొలుపు. ఈ వాదనలో కొంత వాస్తవం ఉంది. న్యూయార్క్‌లోని ఆసియా సొసైటీలో విదేశాంగ మంత్రి జైశంకర్ చేసిన వ్యాఖ్యలు ఇదే మార్పును సూచిస్తున్నాయి. వాణిజ్య ఒప్పందంపై "ఎక్కువ తక్కువగా ఒక అవగాహన"కు వచ్చామని చెబుతూనే, ఎగుడుదిగుడుకు కారణాలుగా సుదీర్ఘ చర్చలను, సరిహద్దు ఉగ్రవాదంపై భారత ఆందోళనకు తగిన అవగాహన, సానుభూతి లేకపోవడాన్ని ప్రస్తావించారు. "నా ప్రధాన ఆందోళనను నా భాగస్వామి పూర్తిగా అర్థం చేసుకోకపోతే, సంబంధంపై ప్రభావం ఉంటుంది" అన్నారు; ఇది పాకిస్తాన్‌తో అమెరికా సాన్నిహిత్యంపై పరోక్ష వ్యాఖ్యగానే అందరూ భావించారు. అయితే భారత ప్రభుత్వం అమెరికాతో సంబంధాలను "ముగిసిన అధ్యాయం"గా భావించడం లేదు. ఇటీవలి మోదీ, ట్రంప్ ఫోన్ సంభాషణ తర్వాత ఇరు దేశాలు "సన్నిహిత సంప్రదింపులు" కొనసాగించాలని అంగీకరించాయి. అమెరికా ఇప్పటికీ భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి; 2024లో ద్వైపాక్షిక వాణిజ్యం 129 బిలియన్ డాలర్లకు చేరగా, భారత్‌కు 45.7 బిలియన్ డాలర్ల మిగులు ఉంది. ఈ మిగులుపై ట్రంప్ పదేపదే విమర్శిస్తున్నా, దానికి ప్రతిగా అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారతీయ అమెరికన్లు చేసిన తోడ్పాటును భారత్ గణాంకాలతో చూపించాలి. ఆ తోడ్పాటు ఎంతో ప్రభుత్వంగానీ, విద్యావేత్తలుగానీ ఇప్పటివరకూ కచ్చితంగా అంచనా వేయకపోవడం విచారకరం. కేవలం "అనవసరం" అంటూ ప్రకటనలు ఇవ్వడం కంటే, గణాంకాలతో కూడిన వాదన ఎక్కువ ప్రభావం చూపుతుంది.

దీనికి మించి, ప్రపంచ రాజకీయాల్లో కొత్త "గ్రేట్ గేమ్" రూపుదిద్దుకుంటోంది: అది చైనా-అమెరికా సంబంధం. జైశంకర్ ఆ రెండు దేశాల అధ్యక్షుల భేటీని ప్రస్తావిస్తూ, కొన్ని అంశాల్లో "సమానతలు" ఉన్నా, మొత్తం మీద వారి సంబంధం "పోటీ"లోనే ఉందని, ఈ ప్రతిష్టంభన "మూడో దేశాలకు" ఖాళీని పూరించే అవకాశమిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో భారత్ ఎలా ఆలోచిస్తుంది, ఎలా వ్యవహరిస్తుంది అన్నది రెండు అగ్రరాజ్యాలకూ ముఖ్యమే. డిసెంబర్ 14, 15 తేదీల్లో మయామిలో జరిగే జీ-20 సదస్సు సందర్భంగా క్వాడ్ భేటీ ఏర్పాటవుతుందని, భారత్ రక్షణ దిగుమతుల్లో అమెరికా వాటా ప్రస్తుత స్థాయిలోనే ఉండేలా కొన్ని కొనుగోళ్లు జరగవచ్చని ఆ విశ్లేషకుడు అంచనా వేస్తున్నారు. కానీ భారత్ ఏ ఒక్క శక్తిపైనా అతిగా ఆధారపడకుండా, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడమే సరైన మార్గం. దీనికి ఆచరణాత్మక చర్యలు కావాలి: యూరోపియన్ యూనియన్, బ్రిటన్ వంటి ఇతర భాగస్వాములతో ఒప్పందాలను వేగవంతం చేయడం (తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేశామని, వీటితో ప్రపంచ జీడీపీలో సుమారు 75 శాతం మార్కెట్లకు ప్రాధాన్య ప్రవేశం లభిస్తుందని గోయల్ చెప్పారు), దేశీయ ఉత్పత్తి, సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడం, ఐటీ రంగం కేవలం అమెరికా మార్కెట్‌పైనే ఆధారపడకుండా విస్తరించడం. అదే సమయంలో అమెరికాతో సంబంధాలను తెంచుకోవడం కూడా తెలివైన పని కాదు; చర్చలు కొనసాగిస్తూ, భారత ప్రయోజనాలను గట్టిగా వినిపిస్తూ, సంతులనం పాటించడమే నేటి అవసరం. ట్రంప్ అమెరికా ప్రయోజనాలపైనే దృష్టి పెట్టడం అర్థం చేసుకోదగినదే; మన ప్రయోజనాలపై మనం కూడా అంతే స్పష్టతతో ఉండాలి. పీఠభూమి మీద ప్రయాణం ఎగుడుదిగుళ్లు లేకుండా ఉండదు. అవి వచ్చినప్పుడు కంగారు పడకుండా, ఎవరి ఉచిత ప్రయాణాన్నీ ఆశించకుండా, తమ దారిని తామే నిర్మించుకునే ఆత్మవిశ్వాసమే భారత్‌కు నిజమైన బలం!

## పనికొచ్చే పలుకు



# ప్రతిదానికీ ఎక్స్‌ప్లనేషన్ ఇవ్వాల్సిన పని లేదు

గ్రూప్ చాట్ నుంచి సైలెంట్‌గా లెఫ్ట్ అయ్యారా? ఎవరినైనా మ్యూట్ చేశారా? ఒక రిలేషన్‌షిప్‌ను వదిలేసి, తర్వాత అందరికీ "అసలు ఏం జరిగిందంటే.." అని ఇన్‌స్టా స్టోరీలో వివరణ ఇవ్వాలని ఎప్పుడైనా అనిపించిందా? ఒకప్పుడు మనం అందరికీ వివరించాలనుకుంటాం, "వాళ్లు నన్ను తప్పుగా అనుకుంటారేమో" అని భయపడతాం. కానీ ఒక దశ తర్వాత విషయం అర్థమవుతుంది. మీరు ఆ పరిస్థితిని నిజంగా అనుభవించి, ఎదుటివారి జీవితం నుంచి ఎందుకు వెళ్లిపోయారో వివరించాల్సిన అవసరం లేదని.

ఒక సినిమా చూసినవారికి క్లైమాక్స్ ఎందుకలా వచ్చిందో చెప్పాల్సిన పనిలేదు, ఎందుకంటే వాళ్లు మొదటి సీన్ నుంచి చూశారు. మీతో కలిసి ఆ పరిస్థితిని అనుభవించిన వారికి అసలు నిజం ఏంటో తెలిసే ఉంటుంది. ఎన్నిసార్లు సర్దుకుపోయారో, ఎన్నిసార్లు ప్రయత్నించారో, ఎప్పుడు అలసిపోయారో వారికి తెలుసు. అప్పుడు కూడా మిమ్మల్ని అర్థం చేసుకోకపోతే, వారికి నిజం తెలియక కాదు, తెలుసుకోవాలని లేక. అలాంటి వారికి వివరణ ఇచ్చి ఏం లాభం?

ఇది ఒక వైఫై సిగ్నల్ లాంటిది. ఎదుటివారి ఫోన్‌లో రిసీవర్ ఆఫ్‌లో ఉంటే, మీరు ఎంత స్ట్రాంగ్ సిగ్నల్ పంపినా కనెక్ట్ కాదు. అర్థం చేసుకోవాలని అనుకోనివారికి మీరు గంటల తరబడి వివరించినా, వారు తమ అభిప్రాయం మార్చుకోరు, ఎందుకంటే వారు వినడానికి కాదు, తమ నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి వింటున్నారు. అలాంటిచోట మీ ఎనర్జీ, సమయం, మనశ్శాంతి వృథా. అందుకే కొన్నిసార్లు మౌనం, ఎక్కువ మాటలకంటే బలమైన సమాధానం.

సోషల్ మీడియా మన మనసులో ఒక భ్రమను నాటింది: ప్రతి నిర్ణయానికి లైక్స్ రావాలి, అందరూ "నువ్వు చేసింది కరెక్ట్" అనాలి. కానీ నిజజీవితంలో అది అసాధ్యం. మీరు ఎంత మంచి నిర్ణయం తీసుకున్నా, ఎవరో ఒకరు విమర్శిస్తారు. మీ ప్రతి నిర్ణయానికి అందరి మద్దతు అవసరం లేదనే నిజాన్ని గ్రహించినప్పుడే, మీరు నిజమైన స్వేచ్ఛను అనుభవిస్తారు. ఈ ఆలోచనను అలవర్చుకుంటే, మీ రోజువారీ జీవితంలో చిన్న చిన్న మార్పులు సాధ్యం. మొదటిది, ఒత్తిడి తగ్గుతుంది. "వాళ్లు ఏమనుకుంటారో" అనే భయం మనసు నుంచి తొలగిపోతే, తలలోని శబ్దం తగ్గుతుంది. రెండోది, నిర్ణయాలు తీసుకోవడం సులువవుతుంది. అందరినీ మెప్పించాలనే ప్రయత్నం లేనప్పుడు, మీకు ఏది సరైనదో అదే ఎంచుకోగలరు. మూడోది, మీ శక్తి సరైన చోట ఖర్చవుతుంది. అర్థం చేసుకోని వారికి వివరణలు ఇవ్వడానికి బదులు, మీ లక్ష్యాలు, ఆరోగ్యం, నిజంగా మీకు విలువనిచ్చే వారి కోసం సమయం కేటాయించగలరు. నాల్గోది, సంబంధాలు నాణ్యమవుతాయి. చిన్న ప్రయోగం చేయండి. ఎవరైనా మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నారనిపిస్తే, వెంటనే వివరణ ఇవ్వకండి. ప్రశ్నించుకోండి. "ఈ వ్యక్తి నా మాట నిజంగా వినాలనుకుంటున్నాడా?" సమాధానం "కాదు" అయితే, ఆ మెసేజ్‌ను డ్రాఫ్ట్‌లోనే వదిలేయండి. ఇంకో అలవాటు: ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకునే ముందు, "ఇది నా విలువలకు సరిపోతుందా?" అనుకోండి, "అందరూ ఏమంటారు?" అని కాదు.

చివరిగా ఒక మాట

ప్రతి కథకూ అందరూ ప్రేక్షకులు కారు. కొందరు ఫ్రంట్ రో కూర్చుని మీతో కలిసి నడిచినవారు, మరికొందరు బయట నుంచి రూమర్లు వినేవారు. రెండోరకం వారికి వివరణలు ఇవ్వడం మానేసి, మొదటి రకం వారిని, ముఖ్యంగా మిమ్మల్ని మీరే గౌరవించుకోండి. మీ నిర్ణయానికి మీరే నిలబడగలిగినప్పుడు, ఎవరి చప్పట్లూ అవసరం ఉండవు, అదే అసలైన స్వేచ్ఛ.

# ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటిక!



శాంతియుతంగా సమావేశమయ్యే, నిరసన తెలిపే ప్రాథమిక హక్కును భారత రాజ్యాంగం పౌరులందరికీ హామీ ఇచ్చింది. సంఘటితమయ్యే, సమావేశమయ్యే, మాట్లాడే హక్కు ప్రజాస్వామ్యానికి గుండెకాయ, వీటిలో ఏ ఒక్క ప్రాథమిక హక్కును అణచివేసినా అది ప్రజాస్వామ్యాన్నే కుదించడం. ఈ నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పోలీసు బలప్రయోగంతో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా రాజధాని ఢిల్లీలో ఈ హక్కులను అణచివేస్తున్నదన్న విమర్శలు ఆందోళన కలిగిస్తున్నాయి. 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ), ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ వంటి యువజన, విద్యార్థి సంఘాలు అక్టోబర్ 10న శాంతియుత నిరసనకు పిలుపునిచ్చాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష (ఎస్ఐఆర్) రద్దు వారి డిమాండ్లు. చట్టప్రకారం శాంతియుత సమావేశాలకు వీలు కల్పించాల్సిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా చర్యలు తీసుకుందన్నది ఆరోపణ. నిరసనకు ముందు రోజు, అంటే అక్టోబర్ 9న, ఢిల్లీలో 57 మెట్రో స్టేషన్ల మూసివేత, ఢిల్లీకి వచ్చే రైళ్ల రద్దుపై వచ్చిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, నిరసనల కారణంగా మెట్రో, రైలు సేవలను పూర్తిగా నిలిపివేయకూడదని కేంద్రాన్ని ఆదేశించింది; ప్రయాణం, సమావేశంపై సమగ్ర నిషేధం విధించడం కుదరదని స్పష్టం చేసింది. కానీ అక్టోబర్ 10న జరిగింది వేరే. ఢిల్లీ పోలీసులు ఉదయమే 150 మందిని నిర్బంధించామని చెప్పగా, తర్వాత కథనాల ప్రకారం వేలాది మందిని ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు (అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్), పలువురు ప్రతిపక్ష నాయకులు, న్యాయవాదులు, పాత్రికేయులున్నారు. సీజేపీ నాయకులు అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను విమానం దిగిన వెంటనే అందులోనే నిర్బంధించారు. జంతర్ మంతర్‌వైపు కవాతు చేసిన న్యాయవాదులను నిర్బంధించారు, గంటల తరబడి ఉంచారు. ఢిల్లీ నడిబొడ్డున గుర్తింపు బిళ్లలు లేని పోలీసు సిబ్బంది వీడియోల్లో కనిపించారని, పాత్రికేయులు, కార్యకర్తలు, విద్యావేత్తలు, న్యాయవాదులపై దాడులు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. అయితే ప్రభుత్వ వైపు నుంచి భిన్న వాదన వినిపిస్తోంది: అక్టోబర్ 10న 271 రైళ్లు సాధారణ శనివారం షెడ్యూల్ ప్రకారమే నడిచాయని, శాంతిభద్రతల పరిరక్షణకే చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ ఆరోపణలు, ప్రతివాదనల్లో నిజానిజాలను తేల్చాల్సింది స్వతంత్ర విచారణే.

ఈ పరిణామాలు కొత్త కావు, ఆందోళన కలిగించే ఒక ధోరణిలో భాగంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జులైలో పరీక్షా పేపర్ల లీకేజీలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన 'ఛలో సంసద్' నిరసనలో పోలీసులు అధిక బలప్రయోగం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. మహిళా నిరసనకారులపై పురుష పోలీసులు దాడి చేస్తున్న వీడియో ఆధారాలున్నా, నెలలు గడిచినా ప్రభుత్వంగానీ, సుప్రీంకోర్టుగానీ ఎవరినీ బాధ్యులుగా నిర్ధారించలేదన్న విమర్శ ఉంది. కనీసం 60 మంది గాయపడ్డారని, లింగ ఆధారిత హింస ఆరోపణలు కూడా ఉన్నాయని పిటిషన్లు పేర్కొన్నాయి, వాటిలో స్వతంత్ర దర్యాప్తు, నిరసనల సమయంలో పోలీసు చర్యలపై మార్గదర్శకాలు, యూనిఫారం లేని లేదా గుర్తింపు లేని సిబ్బందిని వినియోగించకుండా నిషేధం కోరారు. అక్టోబర్ 3న జంతర్ మంతర్ వద్ద ముగ్గురు మహిళా జర్నలిస్టులు పోలీసు అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు; ఆ ఫిర్యాదు నమోదుకే హక్కుల సంఘాలు, పాత్రికేయులు స్టేషన్ ముందు నిరసన తెలపాల్సి వచ్చింది, దాన్ని క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఆ సందర్భంగా పోలీసులు "నిష్పాక్షిక విచారణ" హామీ ఇచ్చినా, అదే తరహా ఆరోపణలు మళ్లీ ఎదురవుతుండటం పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని మరింత దెబ్బతీస్తోంది. అక్టోబర్ 10 నిర్బంధాలపై, మెట్రో పరిమితులపై సుప్రీంకోర్టు ఆదివారం ప్రత్యేక విచారణ జరిపింది. తమ అక్టోబర్ 9 ఆదేశాల ఉల్లంఘనగా భావిస్తూ దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్, ముందస్తు నిర్బంధాల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ వచ్చిన పిటిషన్లను పరిశీలించింది. సమస్య అత్యవసరమైనదని, తీవ్రమైనదని కోర్టు అంగీకరించి, తన ఆదేశాలను పునరుద్ఘాటించింది. అయితే ఇలాంటి విడివిడి ఆదేశాలు, సగం మనసుతో చేసే ఆవేదనలు, విమర్శకులను "విదేశీ ఏజెంట్లు", "దేశద్రోహులు" అంటూ ముద్ర వేయడం మానని, తన రికార్డుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వంపై ఎలాంటి నియంత్రణ ప్రభావం చూపడం లేదన్న విమర్శ వినిపిస్తోంది. కోర్టు ఏదైనా నిర్ణయాత్మక చర్య తీసుకోకపోతే, ప్రతి నిరసన సమయంలోనూ ఇదే పునరావృతమవుతుందన్న ఆందోళన సహజమే.

ఈ నిరసనలన్నిటి వెనుక ఉన్న అసలు కారణాన్ని మరువకూడదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష పేరిట లక్షలాది మంది పౌరులను జాబితాల నుంచి తొలగించారని, అది స్పష్టమైన చట్టవిరుద్ధ చర్య అని ప్రతిపక్షాలు, ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సంఘం, అధికార పక్షం ఈ ఆరోపణలను తిరస్కరిస్తున్నాయి; ప్రక్రియ నిబంధనల ప్రకారమే సాగిందని చెబుతున్నాయి. నిజానిజాలను తేల్చాల్సింది న్యాయస్థానాలే. కానీ ఎన్నికల సంఘంపై జవాబుదారీతనాన్ని కోరే బదులు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కాపాడేందుకు పోలీసు బలాన్ని వాడుతున్నాయన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. ఒక స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అధిపతి విషయంలో అధికార పక్షం ఇంతగా కదలడం, ఆయనకు, అధికార పార్టీకి మధ్య ఇతర పార్టీలతో పోలిస్తే భిన్నమైన సంబంధం ఉందన్న ప్రతిపక్షాల అనుమానాలకు ఊతమిస్తుంది. ప్రభుత్వం ఈ అపోహను చెరిపేయాలంటే, నిరసనకారులను అదుపు చేయడం కాదు, ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలను పారదర్శకంగా నివృత్తి చేయడమే మార్గం. శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత, హింసకు పాల్పడేవారిని చట్టప్రకారం అడ్డుకునే హక్కు ఉంది. కానీ శాంతియుత నిరసనకు సిద్ధపడిన వేలాది మందిని, మాజీ ముఖ్యమంత్రులను, న్యాయవాదులను, పాత్రికేయులను ముందస్తుగా నిర్బంధించడం, రవాణా సౌకర్యాలను అడ్డుకోవడం ఆ పరిధిని దాటినట్టే కనిపిస్తుంది. నిరసనకారులు కూడా శాంతిని, చట్టాన్ని గౌరవించాలి; ఏ ఒక్క హింసాత్మక ఘటన కూడా న్యాయమైన డిమాండ్‌ను బలహీనపరుస్తుంది. ప్రభుత్వం చర్చలకు ముందుకు రావాలి; నిరసనల కోసం నిర్దిష్ట వేదికలు కేటాయించి, ఆ పరిధిలో శాంతియుత సమావేశాలకు అనుమతించాలి. పోలీసులు ఖచ్చితంగా గుర్తింపు బిళ్లలు ధరించేలా, యూనిఫారం లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకుండా ఆదేశాలు జారీ కావాలి. జులై, అక్టోబర్ ఘటనలపై స్వతంత్ర, కాలపరిమితితో కూడిన దర్యాప్తు జరిపి, దోషులపై చర్య తీసుకోవాలి. సుప్రీంకోర్టు కూడా నిరసనల సమయంలో పోలీసు చర్యలపై స్పష్టమైన, అమలు చేయదగిన మార్గదర్శకాలను జారీ చేయడాన్ని పరిశీలించాలి. అంతిమంగా, ఏ ప్రభుత్వమైనా నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి, పౌరులపై అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదు. విమర్శను అణచివేయడం బలానికి చిహ్నం కాదు, అభద్రతకు సంకేతం; ప్రజాస్వామ్యంలో అసలైన బలం, నిలదీసే గొంతులను వినడంలోనే ఉంటుంది! ■



మనం రోజూ తినే ఆహారం శరీరాన్ని తీర్చిదిద్దినట్టే, చూసే సమాచారం మనసును తీర్చిదిద్దుతుంది. ఉదయం లేచింది మొదలు ఆర్థిక కష్టాలు, పెరుగుతున్న ధరలు, వ్యాపార నష్టాల వార్తలనే చూస్తూ ఉంటే, "ఎంత కష్టపడినా ప్రయోజనం లేదు" అనే భావన మనలో నెమ్మదిగా బలపడుతుంది. అది ఒక విషపు చుక్కలా అలవాటుగా మారి, ప్రయత్నించే ధైర్యాన్నే చంపేస్తుంది. వాస్తవాలను తెలుసుకోవడం అవసరమే, కానీ వాటితో పాటు అవకాశాలు, విజయగాథలు, పరిష్కారాలను కూడా చూడండి. మనసుకు సమతుల్యమైన ఆహారం ఇవ్వడమంటే.. విజయంవైపు ప్రయాణమే!

-మహాదేవ

## వింతల్లో వింతలు

# చిన్న కుక్క.. పెద్ద 'కమాండో' ఉద్యోగం!



మెక్సికో నేషనల్ గార్డ్‌లో కొత్తగా చేరిన రిక్రూట్ 'కమాండో' ఎవరో తెలుసా? 13 నెలల చిహువాహువా కుక్క, బరువు కేవలం ఏడు కిలోలు, ఎత్తు 21 సెంటీమీటర్లు! వృద్ధ యజమానులు సాకలేక ఇవ్వడంతో, చిహువాహువా రాష్ట్రంలోనే ఈ ఉద్యోగి దత్తత అయ్యాడు. ఇప్పుడు ఇతడికి టాక్టికల్ వెస్ట్, గాగుల్స్, హెల్మెట్, తలపై కెమెరా కూడా! మెట్లు ఎక్కుతూ, అడ్డంకులు దాటుతూ సెర్చ్ అండ్ రెస్క్యూ శిక్షణ పొందుతున్నాడు. స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో హ్యాండ్లర్ చేతిలో నిద్రపోతూ వైరల్ అయ్యాడు. "సార్జెంట్ 'రాడార్ కింద ఉండండి' అంటే, కమాండో మాటను అక్షరాలా పాటిస్తాడు!"

# రంజీ ట్రోఫీ: హ్యాట్రిక్‌తో దేశ్‌పాండే, సెంచరీతో

దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో సోమవారం పలు ఆసక్తికర పోరాటాలు జరిగాయి. ముంబై పేసర్ తుషార్ దేశ్‌పాండే హ్యాట్రిక్‌తో చెలరేగగా, సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా సెంచరీతో మెరిశాడు. ఇతర మ్యాచ్‌లలో కూడా పలువురు ఆటగాళ్లు శతకాలతో సత్తా చాటారు.

### వాంఖడేలో దేశ్‌పాండే హ్యాట్రిక్ మ్యాజిక్

ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా చండీగఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై పేసర్ తుషార్ దేశ్‌పాండే అద్భుత ప్రదర్శన చేశాడు. తన హ్యాట్రిక్‌తో పాటు మొత్తం 5 వికెట్లు (5/17) పడగొట్టి చండీగఢ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. అతనికి మోహిత్ అవస్థి (3/9) తోడవడంతో చండీగఢ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 78 పరుగులకే ఆలౌట్ అయింది. అంతకుముందు ముంబై తమ తొలి ఇన్నింగ్స్‌లో 429 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో చండీగఢ్‌పై ఫాలో-ఆన్ విధించిన ముంబై, రెండో ఇన్నింగ్స్‌లోనూ దేశ్‌పాండే దెబ్బకు తొలి బంతికే ఒక వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది.

### శతకంతో మెరిసిన జడేజా

రాజ్‌కోట్‌లో ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సౌరాష్ట్ర స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కీలక సెంచరీ నమోదు చేశాడు. సోమవారం 72 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన జడేజా, మొత్తం 209 బంతుల్లో 7 ఫోర్లతో



102 పరుగులు చేసి ఔటయ్యాడు. అదే జట్టుకు చెందిన ప్రేరక్ మన్కడ్ కూడా 129 పరుగులతో రాణించడంతో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 392 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఛత్తీస్‌గఢ్, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది.

### ఇతర మ్యాచ్‌ల హైలైట్స్

విజయవాడలో కర్ణాటకతో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర సత్తా చాటింది. అరంగేట్ర ఆటగాడు ఎస్వీ రాహుల్ (100) సెంచరీతో అదరగొట్టగా, వికెట్ కీపర్ రేవంత్ రెడ్డి (97) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. వీరిద్దరి 202 పరుగుల భాగస్వామ్యంతో ఆంధ్ర 331/6 స్కోరుతో 57 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది.

పంజాబ్‌తో మ్యాచ్‌లో అస్సాం 373 పరుగులకు ఆలౌట్ కాగా, పంజాబ్ తరఫున సీనియర్ పేసర్ ఉమేష్ యాదవ్ 5 వికెట్లతో రాణించాడు. బెంగాల్ తరఫున సుదీప్ కుమార్ ఘరామి (122 నాటౌట్), అభిషేక్ పోరెల్ (114 నాటౌట్) శతకాలతో మెరిశారు. డిఫెండింగ్ ఛాంపియన్ జమ్మూ కాశ్మీర్‌ను మధ్యప్రదేశ్ 120 పరుగులకే కట్టడి చేయడంలో పేసర్ అవేష్ ఖాన్ 3 వికెట్లతో కీలక పాత్ర పోషించాడు.

## ఉప్పల్ మ్యాచ్‌కు భారీ బందోబస్తు - 408 కెమెరాలు, 8 షీ టీమ్స్?తో నిఘా



: భారత్- వెస్టిండీస్ మధ్య నాలుగో టీ20 అక్టోబర్ 14న (బుధవారం) జరగనుంది. ఈ మ్యాచ్?కు హైదరాబాద్? ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. ఇందుకోసం టీమ్ఇండియా జట్టు తాజాగా హైదరాబాద్ చేరుకుంది. రాజధాని నగరంలో టీమ్ఇండియా ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడనుండడంతో తెలుగు రాష్ట్రాల్లో ఫ్యాన్స్?కు క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. మరి ఇప్పటిదాకా ఎన్ని టికెట్లు అమ్ముడయ్యాయి? అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం! ఉప్పల్ స్టేడియంలో సీటింగ్ కెపాసిటీ గరిష్ఠంగా 55 వేలు. అంతమంది ఇక్కడ మ్యాచ్‌ను వీక్షించే అవకాశం ఉంది. అయితే బుధవారం జరగనున్న ఈ మ్యాచ్?కు సంబంధించి ఇప్పటి దాకా 25000 టికెట్లు అమ్ముడైనట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. ఇంకా టికెట్ సేల్ జరుగుతుండడంతో 40 వేల దాకా అభిమానులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ మ్యాచ్? కోసం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. ఇందుకోసం 2,200 మంది పోలీసులు విధుల్లో ఉండనున్నట్లు చెప్పారు. బ్లాక్ టికెట్ల సేల్?పైనా ప్రత్యేక నిఘా ఉంటుందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా నిఘా కోసం స్టేడియం చుట్టూ 4 వాచ్ టీమ్‌లు, 408 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఇక మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అందుకోసం 8 షీ టీమ్స్ మఫ్టీలో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. వీళ్లంతా ప్రేక్షకుల భద్రత కోసం సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు. దాదాపు 8 వేల వాహనాలు నిలిపి ఉంచేలా పార్కింగ్ కోసం స్థలం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇక బంజారాహిల్స్ హోటల్? నుంచి ప్లేయర్లు స్టేడియానికి రానున్నారు. కాగా, మ్యాచ్? కోసం అభిమానులను మధ్యాహ్నం 2 గంటల నుంచే స్టేడియంలోకి అనుమతిస్తామని సీపీ చెప్పారు. అయితే స్టేడియానికి వచ్చే అభిమానులు ఆర్టీసీ, మెట్రో సేవలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మ్యాచ్ నేపథ్యంలో స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పౌరులు నిబంధనలను పాటించాలని కోరారు. ఇక ఈ మ్యాచ్ కోసం ఇవాళ సాయంత్రమే భారత క్రికెట్ జట్టు హైదరాబాద్?కు చేరుకుంది. ఈ ప్రయాణంలో విమానంలో జరిగిన ఓ సరదా సన్నివేశాన్ని యువ క్రికెటర్ ఇషాన్ కిషన్ షేర్ చేసుకున్నాడు. హైదరాబాద్?కు వస్తుండడంతో ఇక్కడి ప్రేక్షకుల కోసం తెలుగులో మాట్లాడుతూ ఓ సెల్ఫీ వీడియో రికార్డ్ చేశాడు. 'హలో! హైదరాబాద్, ఎలా ఉన్నారు?' అని ఇషాన్ సరదాగా అన్నాడు. ఈ వీడియోలో అతడి పక్కన తెలుగు క్రికెటర్లు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి ఉన్నారు. కాగా, ఐపీఎల్?లో ఇషాన్ మన సన్?రైజర్స్? హైదరాబాద్? జట్టుకే ఆడుతున్నాడు. అందుకే అతడు ఉప్పల్ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్?లాగా భావిస్తాడు.

## స్పోర్ట్స్

### పంత్‌కు గాయం.. టీమిండియాలో మార్పు

న్యూజిలాండ్-ఏతో జరగనున్న మూడు మ్యాచ్‌ల అనధికారిక సిరీస్‌కు ముందు భారత-



ఏ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయం కారణంగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో యువ వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుషాగ్రా జట్టులోకి వచ్చాడు. ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌లో పంత్‌కు గాయమైంది. టెస్టు సిరీస్‌కు సన్నాహకంగా భావిస్తున్న ఈ సిరీస్‌కు పంత్ ఎంపిక కూడా ఫిట్‌నెస్ అనుమతులకు లోబడే జరిగింది. పంత్ మూడో మ్యాచ్‌లో ఆడటంపై మరో ?ప్రకటన త్వరలో? వెలువడుతుంది. కాగా, న్యూజిలాండ్‌లో టీమిండియా పర్యటనకు ముందు భారత్-ఏ, న్యూజిలాండ్-ఏ జట్ల మధ్య అనధికారిక టెస్ట్ సిరీస్ జరుగనుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ అక్టోబర్ 24న, రెండో మ్యాచ్ అక్టోబర్ 31న, మూడో మ్యాచ్ నవంబర్ 7న మొదలవుతాయి.

ఈ సిరీస్ కోసం భారత-ఏ జట్టును కొద్ది రోజుల కిందటే ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా ధ్రువ్ జురెల్ ఎంపికయ్యాడు. ఈ జట్టులో పంత్, జురెల్‌తో పాటు భారత టెస్ట్ జట్టు రెగ్యులర్ సభ్యులు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ కూడా అవకాశం దక్కింది.

#### అప్‌డేటెడ్ భారత్-ఏ జట్టు

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రవిచంద్రన్ స్మరణ్, ధ్రువ్ జురెల్ (కెప్టెన్, వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, ఔకిబ్ నబీ, ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్, మానవ్ సుతార్, ముఖేశ్ చౌదరి, సాయి సుదర్శన్, యశ్ రాథోడ్, ముఖేశ్ కుమార్, కుమార్ కుషాగ్రా (తొలి రెండు మ్యాచ్‌లకు) ఇదిలా ఉంటే, భారత్, న్యూజిలాండ్-ఏ జట్ల మధ్య సిరీస్ ముగిశాక భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ మొదలవుతుంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్ నవంబర్ 19న మొదలుకానుండగా.. రెండో టెస్ట్ నవంబర్ 27న ప్రారంభం కానుంది. టెస్ట్ సిరీస్‌కు ముందు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య 5 టీ20లు, 5 వన్డేల భారీ సిరీస్‌లు జరుగనున్నాయి.

#### సూపర్ ఫామ్‌లో కుషాగ్రా

21 ఏళ్ల కుషాగ్రా ప్రస్తుతం రెడ్‌బాల్ క్రికెట్‌లో మంచి ఫామ్‌లో ఉన్నాడు. తన చివరి మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో రెండుసార్లు శతకాలు సాధించాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్‌తో పాటు పుదుచ్చేరిలో ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరిగిన మ్యాచ్‌లోనూ సెంచరీ నమోదు చేశాడు.

# శృతి హాసన్.. పర్సనల్ ఫ్రీడమ్ కు లిమిట్స్ ఎక్కడ?



హీరోయిన్లు తమ పర్సన్ లైఫ్ పై మాట్లాడటం కొత్తేమీ కాదు. కానీ కొన్ని విషయాలపై ఓపెన్ గా మాట్లాడితే మాత్రం వెంటనే డిబేట్ స్టార్ట్ అవుతుంది. ఇప్పుడు స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ చేసిన కామెంట్స్ కూడా అలాంటి చర్చనే మొదలుపెట్టాయి. అయితే ఆమె చేసిన కామెంట్స్ కంటే.. దాని వెనుక ఉన్న ఆలోచన ఏంటనేదే అసలు అబ్జర్వ్ చేయాల్సిన విషయం.



శ్రుతి హాసన్ రీసెంట్ గా సెల్ఫ్ కేర్, పర్సనల్ ఫ్రీడమ్ వంటి విషయాలపై మాట్లాడారు. ఆ సమయంలో సెలిక్స్ టాయ్స్ ను కూడా సెల్ఫ్ కేర్ లో భాగంగా చూడొచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ విషయంలో ఇతరుల పర్మిషన్ అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత నిర్ణయాలను తామే తీసుకునే ఫ్రీడమ్ ఉండాలని చెప్పారు. ఇక్కడ శ్రుతి చెప్పిన అసలు పాయింట్ ఒక వస్తువు గురించి మాత్రమే కాదు.

మన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన నిర్ణయాలపై సొసైటీ ఎంతవరకు ఎఫెక్ట్ చూపించాలనేదే ఆమె కామెంట్స్ లో కనిపిస్తున్న మెయిన్ ఎలిమెంట్. ముఖ్యంగా పర్సనల్ లైక్స్, రిలేషన్స్, బాడీ, ప్రైవసీ వంటి విషయాల్లో ఇతరులు చేసే జడ్మెంట్లకు భయపడకుండా.. తమకు ఏది కంఫర్ట్ గా ఉంటుందో దానిని వ్యక్తులు నిర్ణయించుకోవాలన్నది ఆమె అభిప్రాయంగా కనిపిస్తోంది.అయితే మన సొసైటీలో ఇలాంటి విషయాలు ఇప్పటికీ కామన్ గా మారలేదు. అందుకే శ్రుతి కామెంట్స్ బయటకు వచ్చిన వెంటనే ఆమె చెప్పిన విషయం కంటే.. ఆమె ఎందుకు ఇలా మాట్లాడారనే యాంగిల్ లో ఎక్కువగా చర్చ జరుగుతోంది. కొందరికి ఇది పర్సనల్ ఫ్రీడమ్ గురించి చెప్పిన జస్ట్ ఒపీనియన్ గా కనిపిస్తే.. మరికొందరికి మాత్రం ఇలాంటి విషయాలను బహిరంగంగా మాట్లాడటం అవసరమా అనే ప్రశ్న రావచ్చు.అందుకే శ్రుతి ఒపీనియన్ తప్పా? ఒప్పా? అనే విషయం ఇంట్రెస్టింగ్ గా మారింది. నిజానికి ఆమె కామెంట్స్ ను అందరూ ఒకే విధంగా చూడాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత ఎంపికల విషయంలో ఎవరి అభిప్రాయం వారిదే. అయితే పర్సన్ ఫ్రీడమ్ అంటే బాధ్యత కూడా ఉండాలనే విషయం కూడా అంతే ముఖ్యమైనది. ఏ వ్యక్తిగత నిర్ణయమైనా అది తనకు, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ఉండటం అవసరం.

మరోవైపు సెల్ఫ్ కేర్ అనే పదానికి కూడా అర్థం మారుతుంది. గతంలో ఇది హెల్త్, రెస్ట్, పీస్ ఫుల్ నెస్ వంటి విషయాలకే ఎక్కువగా పరిమితమయ్యేది. ఇప్పుడు పర్సనల్ కంఫర్ట్, ప్రైవసీ, ఎమోషనల్ నీడ్స్ అవసరాలు కూడా ఇందులో భాగంగా చర్చకు వస్తున్నాయి. శ్రుతి కామెంట్స్ ను కూడా మారుతున్న థింకింగ్ ప్రాసెస్ లో చూడొచ్చు.

అందుకే ఆమె మాటలను కేవలం బోల్డ్ కామెంట్స్ గా చూడటం కంటే.. పర్సనల్ ఫ్రీడమ్, ప్రైవసీ, సామాజిక తీర్పులపై ఆమె చెప్పిన అభిప్రాయంగా చూడటం బెటర్. అయితే యాక్సెప్ట్ చేయాలా లేక వ్యతరేకించాలా అనేది ఎవరి వ్యక్తిగత ఆలోచన వారిదే. కానీ సాధారణంగా మాట్లాడటానికి ఇబ్బంది పడే అంశంపై శ్రుతి మరోసారి తన అభిప్రాయాన్ని క్లియర్ గా చెప్పారని అనడంలో డౌట్ అక్కర్లేదు.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com